PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupati, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 86 | విజయవాడ, సోమవారం 27 అక్టోబర్ 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No Vijayawada, Monday 27 October 2025 Rs



ఏటికేడూ పెరిగిపోతున్న వ్యర్థాలు

- ఏటా 3.88 కోట్ల టన్నుల చెత్త
- ప్లాస్టిక్ వేస్ట్ 1.2 లక్షల టన్నులు

3



బెంగళూరుకే ప్రైమ్ వాలీబాల్ లీగ్ టైటిల్ 6

అనుక్షణం.. అప్రమత్తం


- తీరప్రాంత గ్రామాల్లో పునరావాస కేంద్రాలకు ప్రజల తరలింపు
- ప్రాణ నష్టం జరగరాదు
- అంతరాయం లేకుండా విద్యుత్తు, టెలికాం, తాగునీరు
- 'మొంథా'పై సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మొంథా తుపాను రాష్ట్రంపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉన్న నేపథ్యంలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, తీర ప్రాంత గ్రామాల ప్రజలను సమీపంలోని తుపాను రక్షణ కేంద్రాలకు తరలించి పునరావాసం కల్పించాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో తీరప్రాంత జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, తీవ్రమైన గాలులు వీస్తాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో.. విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న సిఎం అక్కడ్నుంచి అధికారులతో ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాయుగుండం 28వ తేదీ ఉదయం నాటికి తీవ్రమైన తుపానుగా మారుతుందని, అదే సమయంలో ఎక్కడా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తుపాను తీవ్ర ప్రభావం చూపిస్తుందని ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసేలా సమాచార వ్యవస్థలు సిద్ధంగా ఉంచాలన్నారు. ఎస్ఎంఎస్ అలెర్ట్స్, సోషల్ మీడియా, ఐవిఆర్ఎస్ కాల్స్, వాట్సాప్‌ల ద్వారా ప్రజలకు ముందస్తు హెచ్చరికలు పంపించాలన్నారు. తుపానుపై ప్రెడిక్టివ్ మోడల్, రియల్ టైమ్ డేటా ఆధారంగా విశ్లేషణ చేస్తున్నామన్నారు. రిజర్వాయర్లు, ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో నీటి మట్టాలను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు అందుకు అనుగుణంగా కార్యాచరణ అమలు చేయాలన్నారు.

డ్రోన్ల ద్వారా సహాయక చర్యలు

రాష్ట్ర వ్యాప్తంగా 27 వేల సెల్ టవర్లను డీజిల్ జనరేటర్లతో సిద్ధం చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. విద్యుత్తు, టెలికాం, తాగునీటి సరఫరా వ్యవస్థలకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులు, చెరువులు, కాలువ గట్లు కోతకు గురైతే తక్షణమే మరమ్మతులు చేసేలా సిద్ధంగా ఉండాలన్నారు. డ్రోన్ల ద్వారా సహాయక చర్యలు చేపట్టేలా ఉండాలని, చెట్లు కూలిపోయినా, కొమ్మలు విరిగిపడినా వాటిని తొలగించేందుకు అవసరమైన పవర్‌సా, మిగతా 5లో



బలపడుతోన్న తీవ్ర వాయుగుండం

బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం మరింత బలపడుతోంది. గడిచిన 6 గంటల్లో.. గంటకు 5 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. విశాఖకు దక్షిణ ఆగ్నేయంగా.. 820 కిలోమీటర్లు, కాకినాడకు ఆగ్నేయంగా 810 కిలోమీటర్ల దూరంలో తీవ్ర వాయుగుండం ఉన్నట్లు విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు చెబుతున్నారు. రాగల 12 గంటల్లో ఇది తుపానుగా మారే అవకాశం ఉందని ప్రకటించారు.

తీరం వెంబడి గాలుల తీవ్రత పెరిగింది. గంటకు 35 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తున్నాయి. సోమవారం గాలుల తీవ్రత 55 నుంచి 75 కిలోమీటర్ల వరకు పెరుగుతుందని భావిస్తున్నారు. రాయలసీమ, కోస్తాంధ్రలోని ఒకట్రెండు ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదవుతున్నాయి. సోమవారం, మంగళవారం నాడు చాలా జిల్లాలకు ఇప్పటికే వాతావరణశాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. తీవ్ర వాయుగుండం తుపానుగా మారిన తర్వాత ఉత్తర వాయువ్య దిశగా పయనించి, మరింత బలపడి తీవ్ర తుపానుగా మారి.. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మచిలీపట్నం-కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశముందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని ఓడరేవుల్లో ఒకటో నెంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

డేటా సెంటర్‌పై వాస్తవాలు చెప్పండి

- ఉద్యోగాలపై స్పష్టతనివ్వండి
- పర్యావరణంపై ప్రభావమెంత
- అదానికి ఇచ్చిన 400 ఎకరాలు గూగుల్‌కి మళ్లించండి
- ముఖ్యమంత్రికి సిపిఎం బహిరంగ లేఖ



ముఖ్యమంత్రికి సిపిఎం రాసిన లేఖను చూపుతున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖలో ఏర్పాటు కానున్న గూగుల్ డేటా సెంటర్‌పై ప్రజలకు వాస్తవాలు చెప్పాలని, అది వస్తే నిజంగా ఎంతమందికి ఉపాధి లభిస్తుందో తెలియజేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గూగుల్ కోసం కొత్తగా భూములు సేకరించే బదులు అదాని డేటా సెంటర్‌కు ఇప్పటికే కేటాయించిన 400 ఎకరాలను గూగుల్‌కు కేటాయిస్తే సరిపోతుందన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు పార్టీ తరపున రాసిన లేఖను ఆదివారం విశాఖపట్నంలోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అమెరికా తర్వాత అతిపెద్ద డేటా సెంటర్‌ను రాబోయే ఐదేళ్లలో 15 బిలియన్ డాలర్ల (రూ.లక్షా 25 వేల కోట్లు) పెట్టుబడితో విశాఖలో నెలకొల్పనున్నట్లు ఢిల్లీలో గూగుల్ సంస్థ ప్రతినిధులతో జరిగిన సమావేశం అనంతరం ముఖ్యమంత్రి ప్రకటించారని, ఎఐ హబ్‌ను కూడా నెలకొల్పబోతున్నట్లు చెప్పారని అన్నారు. సహజంగానే ఇది ప్రజల్లో, ముఖ్యంగా విద్యావంతులైన యువతరంలో అనేక ఆశలు రేకెత్తించిందని పేర్కొన్నారు. దీనికోసం 500 ఎకరాలు కేటాయించారన్నారు. గూగుల్‌తో అదాని కనెక్స్, ఎయిర్‌టెల్ కమ్యూనికేషన్స్ కూడా భాగస్వాములవుతున్నాయని, లక్షా 80 వేలకుపైగా ఉద్యోగాలు లభిస్తాయని ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ విజయాన్ని చూసి ఇరుగు పొరుగు రాష్ట్రాల వారు అసూయ పడుతున్నట్లు, ప్రతిపక్ష పార్టీలు ఓర్చుకోలేక విమర్శలు చేస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారన్నారు. వాస్తవానికి టిడిపి కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న బిజెపి నేతలే అన్ని ఉద్యోగాలు రావని, పర్యావరణానికి నష్టం ఉంటుందని చెప్పక తప్పలేదని పేర్కొన్నారు. కేంద్ర మంత్రిగా ఉన్న పెమ్మసాని చంద్రశేఖర్ కూడా ఐదు నుంచి ఆరు వేల వరకు ఉద్యోగాలు వస్తాయని, పరోక్షంగా ఇంకో 30 వేల మందికి ఉపాధి దొరకొచ్చని చెప్పారన్నారు. ప్రభుత్వ ప్రచారం దీనికి పూర్తి భిన్నంగా ఉందని వివరించారు. మీడియాలో వస్తోన్న విభిన్న కథనాలు, వివిధ దేశాల అనుభవాలను పరిశీలిస్తే దీనిపై వాస్తవాలతో నిమిత్తం లేకుండా అతిశయోక్తులతో ప్రచారం జరుగుతున్నట్లుగా ఉందన్నారు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ప్రజలకు వాస్తవాలు వెల్లడించాలని కోరారు. విశాఖలో ఏర్పాటు చేసే గూగుల్ డేటా సెంటర్ ద్వారా సముద్ర గర్భం నుంచి కేబుల్ కనెక్షన్లతో 12 దేశాలతో అనుసంధానం జరిగి గేట్‌వేగా ఉండబోతోందని, తద్వారా గూగుల్ వ్యాపారం ప్రపంచమంతటా విస్తరించనుందని, దీనివల్ల గూగుల్‌కు ఇబ్బడి ముబ్బడిగా లాభాలు పెరుగుతాయిగానీ ఆంధ్రప్రదేశ్‌కి ఏ విధంగా లాభం చేకూరుతుందని శ్రీనివాసరావు ప్రశ్నించారు. డేటా సెంటర్ కోసం విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలంలోనూ, అనకాపల్లి జిల్లాలోనూ కలిపి 480 ఎకరాలు కేటాయించారన్నారు. ఇందులో పంట భూములు, దళితుల అసైన్డ్ భూములు ఉన్నాయని తెలిపారు. వాటిని తీసుకోవడం ద్వారా రైతులు, కూలీలు ఉపాధి కోల్పోతారన్నారు. సింహాచలం దేవస్థానం కింద పంచగ్రామాల ప్రజలు ఇళ్ల పట్టాల కోసం దీర్ఘకాలంగా పోరాడుతున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదుగానీ అదే ప్రాంతంలో అడవివరంలో గూగుల్ కోసం భూములు కేటాయించారని, ఇదేమి న్యాయమని ప్రశ్నించారు.


అదానికి ఇచ్చిన భూములన్నీ ఖాళీ

2,019లో చంద్రబాబు ప్రభుత్వం అదానితో ఒప్పందం చేసుకుందన్నారు. దీని ప్రకారం రూ.70 వేల కోట్లు పెట్టుబడి, లక్ష ఉద్యోగాలు వస్తున్నట్లు ప్రకటించారని గుర్తు చేశారు. తర్వాత వచ్చిన ప్రభుత్వం 2,023లో అదాని కనెక్స్‌తో మిగతా 5లో

జిల్లాల పునర్వ్యవస్థీకరణపై రేపు కీలక సమావేశం

- ముఖ్యమంత్రితో మంత్రివర్గ ఉపసంఘం భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి ఈ నెల 28న కీలక సమావేశం జరగనుంది. ఇందుకు సంబంధించిన మంత్రివర్గ ఉపసంఘం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో భేటీ కానుంది. కొత్త జిల్లాల పునర్విభజన, జిల్లా కేంద్రాల మార్పులపై ఈ సమావేశంలో చర్చించే అవకాశమున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. కొత్త జిల్లాలు, జిల్లా కేంద్రాల మార్పులకు సంబంధించిన పలు సూచనలను కేబినెట్ సబ్ కమిటీ ఇప్పటికే సూచించింది. కేబినెట్ సబ్ కమిటీలో వెల్లడయ్యే అంశాలపై నవంబరు 7న జరగనున్న మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ఈ ప్రక్రియను డిసెంబరు 31 కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

బస్సు ప్రమాద ఘటన.. బంధువులకు మృతదేహాలు అప్పగింత

- బైకర్ శివశంకర్‌పై కేసు

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి/హాస్పిటల్

కర్నూలు జిల్లా చిన్నటేకూరు సమీపంలో వేమూరి కావేరి బస్సు ప్రమాద ఘటనలో మృతదేహాలను బంధువులకు ఆదివారం అప్పగించారు. 18 మంది మృతుల బంధువుల నుంచి డిఎన్ఎ పరీక్షల కోసం రక్తనమూనాలు సేకరించగా, ఆదివారం ఉదయం ఈ రిపోర్టులు అందాయి. 18 మృతదేహాల డిఎన్ఎ నమూనాలు, బంధువుల డిఎన్ఎ నమూనాలతో సరిపోలడంతో కర్నూలు జిజిహెచ్ మార్చురీలో భద్రపరచిన 17 మంది మృతదేహాలను బంధువులకు అప్పగించారు. అంబులెన్సులు ఏర్పాటు చేసి వారి స్వగ్రామాలకు వాటిని తరలించారు. ఒడిశాకు చెందిన కె దీపక్ కుమార్ మృతదేహాన్ని బంధువులు సోమవారం వచ్చి తీసుకుంటామని చెప్పారు. బీహార్‌కు చెందిన అమ్రిత్ కుమార్ మృతదేహాన్ని తమ గ్రామానికి తీసుకెళ్లలేమని కుటుంబ సభ్యులు చెప్పడంతో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల సహకారంతో ఇక్కడే అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాల అప్పగింత ప్రక్రియను కర్నూలు కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ఎస్‌పి విక్రాంత్ పాటిల్ పర్యవేక్షించారు. కలెక్టర్ సిరి మాట్లాడుతూ మన



రాష్ట్రానికి చెందిన మృతుల కుటుంబ సభ్యుల బ్యాంకు వివరాలు తీసుకుని ప్రభుత్వం ప్రకటించిన పరిహారాన్ని బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. బస్సు ప్రమాద ఘటనలో 19వ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఆ మృతదేహం చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం యనగాని పల్లెకు చెందిన త్రిమూర్తి (52)గా నిర్ధారించారు. ఆదివారం ఉదయం మృతుడి కుమారుడి నుంచి రక్తనమూనాను సేకరించి డిఎన్ఎ పరీక్ష కోసం మంగళగిరి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. సోమవారం డిఎన్ఎ రిపోర్టు రానున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రమాదంలో మృతి చెందిన బైకర్ శివశంకర్‌పై ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయన స్నేహితుడు ఎర్రి స్వామి ఫిర్యాదుతో బిఎన్ఎస్ 281, 125 (ఎ), 106 (1) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు మిగతా 5లో

కేంద్ర దివాళాకోరు విధానాలపై రాజీలేని పోరాటం

- ఎల్‌ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆరో రాష్ట్ర మహాసభ ప్రారంభంలో ఎమ్మెల్సీ గోపిమూర్తి

2లో

ఐసిడిఎస్‌లో 'షోకాజ్'ల కలకలం

- రాష్ట్ర వ్యాప్తంగా 23 మంది సిడిపిఒలు, 22 మంది సూపర్‌వైజర్లకు నోటీసులు

2లో

అభివృద్ధి పేరిట గంగపుత్రుల జీవితాలను నాశనం చేయొద్దు

2లో

ఈ శతాబ్దం మనదే

భారత్ - ఆసియాన్ బంధం దృఢమైనది

వర్చువల్ ప్రసంగంలో ప్రధాని మోడీ



న్యూఢిల్లీ : 21వ శతాబ్దం భారత్, ఆసియాన్‌దేనని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. భారత్, ఆసియాన్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం ప్రపంచ స్థిరత్వం, వృద్ధికి శక్తివంతమైన పునాదిగా అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం ప్రారంభమైన ఆసియాన్ (ఆగ్నేయ ఆసియా దేశాల) సదస్సును ఉద్దేశించి ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. '21వ శతాబ్దం మనదే. భారత్, ఆసియాన్ శతాబ్దమే. ఆసియాన్ కమ్యూనిటీ విజన్ - 2045, వికసిత్ భారత్ 2047 లక్ష్యాలు మన మానవాళికి ఉజ్వల భవిష్యత్తును అందిస్తాయని విశ్వసిస్తున్నాను' అని చెప్పారు. ఆగ్నేయాసియా, తూర్పు ఆసియా దేశాలతో సంబంధాలను విస్తరించుకునేందుకు భారత్ అవలంభిస్తున్న యాక్ట్ ఈస్ట్ విధానానికి ఆసియాన్ సదస్సు మూల స్తంభమని మోడీ తెలిపారు. భారత్, ఆసియాన్ వాణిజ్య భాగస్వాములు మాత్రమే కావని, అవి సాంస్కృతిక భాగస్వాములు కూడా అని చెప్పారు. 'ప్రపంచ జనాభాలో దాదాపుగా నాలుగో వంతుకు మనం ప్రాతినిధ్యం వహిస్తున్నాం. మనం కేవలం జనాభాను మాత్రమే పంచుకోవడం లేదు. సంస్కృతి, విలువలను కూడా... గ్లోబల్ సౌత్‌లో మనం భాగస్వాములం' అని ఆయన అన్నారు. వివిధ అంశాలపై ఆసియాన్ దేశాలు కలసికట్టుగా పనిచేయాలని మోడీ సూచించారు. ఏ విపత్తులో అయినా ఆసియాన్ స్నేహితులకు అండగా ఉంటామని చెప్పారు. అది హెచ్ఎడిఆర్ కావచ్చు... బ్లూ ఎకానమీ కావచ్చు... సముద్ర భద్రత కావచ్చు... భారత్ సహకారం వేగంగా పెరుగుతోందని తెలిపారు. 2026ను ఆసియాన్ - ఇండియా సముద్ర సహకార సంవత్సరంగా ప్రకటిస్తున్నామని అన్నారు. సదస్సును విజయవంతంగా నిర్వహి స్తున్నందుకు మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంను మోడీ అభినం దించారు. తూర్పు తైమూరును ఆసియాన్ 11వ సభ్య దేశంగా చేర్చడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరు ఐటి ఉద్యమ నేతల అరెస్టు

- 12 గంటల షిఫ్ట్‌పై నిరసనలను అడ్డుకునేందుకే : కెఐటియు
- తక్షణమే విడుదల చేయండి : సిపిఎం డిమాండ్



చిత్ర భాను, ఎ. సుహాస్

బెంగళూరు : ఐటి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రచారం చేస్తున్న కర్ణాటక రాష్ట్ర ఐటి ఉద్యోగుల సంఘం (కెఐటియు) నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. 10 గంటల షిఫ్ట్‌ను 12 గంటలకు పెంచడాన్ని నిరసిస్తూ డిసెంబర్ 21న నిరసనలకు కెఐటియు పిలుపునిచ్చింది. నిరసన కార్యక్రమాన్ని ప్రారంభంలోనే అడ్డుకోవాలనే ఉద్దేశంతో కెఐటియు ముఖ్య నాయకులు చిత్ర భాను, ఎ. సుహాస్‌లను శనివారం రాత్రి బెంగళూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటి వరకూ వారి సమాచారాన్ని తెలపలేదు. వారిని కలవడానికి ఎవరినీ అనుమతించడం లేదు. నిరసనలను అడ్డుకునేందుకు నేతలను అరెస్టు చేశారని కెఐటియు విమర్శించింది. ఐటి నాయకుల అరెస్టును సిపిఎం కేంద్ర కమిటీ ఖండించింది. ఈ మేరకు సోషల్ మాధ్యమం ఎక్స్‌లో ఆదివారం పోస్ట్ చేసింది.

నెలల తరబడి ఆందోళన

బెంగళూరులో ఐటి, ఐటిఇఎస్, బిపిఒ రంగాల్లో రోజువారీ పని గంటలను 10 నుండి 12 గంటల వరకు పెంచారు. దీనిని వ్యతిరేకిస్తూ గత ఐదు నెలల నుండి ఐటి ఉద్యోగులు ఆందోళన నిర్వహిస్తున్నారు. డిసెంబర్ 21న శాంతియుత ఆందోళనకు కెఐటియు పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమం విజయవంతానికి కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ ఆందోళనలను అడ్డుకునేందుకే నాయకులను అరెస్టు చేశారని కెఐటియు విమర్శించింది. నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది.

ప్రజల గొంతు నిలువరించలేరు : సిపిఎం

ప్రభుత్వం అణిచివేత చర్యల ద్వారా ప్రజల గొంతును నిలువరించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోకుండా నిర్బంధించడం సరికాదని సిపిఎం కేంద్ర కమిటీ తెలిపింది. అప్రజాస్వామికంగా కర్ణాటక ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించింది. అరెస్ట్ చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసింది.

మరుగుదొడ్లు అధ్వానం!

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ గిరిజన సంక్షేమ హాస్టళ్లు వసతులలేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. కొన్ని హాస్టళ్ల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరుగుదొడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఏలూరు జిల్లాలోని గిరిజన హాస్టళ్లలో సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుట్టాయగూడెం, జిల్లా కేంద్రం ఏలూరులోని గిరిజన కళాశాల వసతి గృహాలను 'ప్రజాశక్తి' పరిశీలించింది. ఏలూరు జిల్లాలో మొత్తం గిరిజన సంక్షేమ హాస్టళ్లు 40 వరకూ ఉన్నాయి. వీటిలో ఆశ్రమ పాఠశాలలు 25, గిరిజన సంక్షేమ కళాశాల వసతి గృహాలు తొమ్మిది, ఇతర హాస్టళ్లు ఉన్నాయి. గిరిజన సంక్షేమ హాస్టళ్లలో దాదాపు తొమ్మిది వేల మంది విద్యార్థులు వసతి పొందుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిలో సరైన వసతులు లేవు. ఏజెన్సీలో మండల కేంద్రమైన బుట్టాయగూడెంలోని గిరిజన కళాశాల హాస్టల్‌లో 60 మంది వరకూ విద్యార్థులు ఉన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు, భద్రాచలం ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఇక్కడ ఇంటర్, ఐటిఐ, డిగ్రీ విద్యార్థులున్నారు. హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలిపోతుందో తెలియక బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. మౌలిక సౌకర్యాలూ కరవయ్యాయి.



బుట్టాయిగూడెం గిరిజన సంక్షేమ కళాశాల హాస్టల్‌లో తలుపులేని మరుగుదొడ్లు

అత్యధిక మరుగుదొడ్లకు తలుపులు లేవు. వాడకం నీరు వెళ్లడానికి డ్రెయినేజీ వ్యవస్థ కరువైంది. గత కొన్నేళ్లుగా కొత్త భవనం నిర్మిస్తామని మాటలు చెబుతున్నా ఆచరణకు నోచుకోలేదు.

ఏలూరు గిరిజన హాస్టల్‌కు ప్రహరీ, సరైన దారి కరువు

ఏలూరులోని గిరిజన కళాశాల వసతి గృహానికి ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ కరువైంది. ఈ హాస్టల్లో ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చిన 50 మంది గిరిజన విద్యార్థులు ఉంటున్నారు. హాస్టల్ వెనుక చెరువును తలపించేవిధంగా పెద్ద మురుగు నీటిగుంట ఉండడంతో దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి నుంచి హాస్టల్ భవనం 50 మీటర్లలో దూరం ఉంది. సరైన దారి లేకపోవడంతో వర్షం వచ్చినప్పుడు నీరు నిల్వ ఉండి రాకపోకలకు విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇక్కడ చదువుతున్న విద్యార్థులు ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉన్న సిఆర్‌రెడ్డి, ఆశ్రం, కోటదిబ్బ కాలేజీలకు వెళ్తున్నారు. రవాణా సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నారు.కొయ్యలగూడెంలోని గిరిజన కళాశాల వసతి గృహం అద్దె భవనంలో నడుస్తోంది. ఇక్కడ 78 మంది విద్యార్థులు ఉన్నారు.

గిరిజన హాస్టళ్లలో పరిస్థితి దారుణం

నిర్వహణకు నిధులివ్వని ప్రభుత్వం

శిథిలమైన బుట్టాయగూడెం హాస్టల్‌లో 60 మంది విద్యార్థులు

మెయింటినెన్స్ ఖర్చులు నిల్.. అరకొరగా మెనూ ఛార్జీలు

హాస్టళ్లలోని మరుగుదొడ్లు శుభ్రం చేయడానికి, ఫ్యాన్లు, లైట్లు దెబ్బతింటే మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం మెయింటినెన్స్ ఖర్చులు ఇవ్వడం లేదు. మరుగుదొడ్లు పది రోజులకు ఒకసారి కూడా శుభ్రం చేయని పరిస్థితి ఉంది. దీంతో, దుర్వాసన వస్తోంది. వార్డెన్లు సొంత ఖర్చులతో ఈ పనులు చేయాల్సి వస్తోంది. నెలకు కనీసంగా రూ.రెండు వేలు వరకూ ఇచ్చుకోవాల్సి వస్తోంది. ఈ సొమ్ములిచ్చేందుకు కొన్నిచోట్ల భోజనం నాణ్యత తగ్గించేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

బుట్టాయగూడెంలో కొత్త గిరిజన హాస్టల్ భవనానికి నిధులు మంజూరు

శిథిలావస్థలో ఉన్న బుట్టాయగూడెం హాస్టల్ భవన నిర్మాణానికి రూ.2.05 కోట్లు మంజూరయ్యాయి. విద్యార్థులను తాత్కాలికంగా వేరే భవనంలోకి మార్చేందుకు, హాస్టల్ కొత్త భవనం నిర్మించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. కొత్తగా బాధ్యతలు తీసుకున్నాను. మిగిలిన హాస్టళ్లను పరిశీలించి వాటి పరిస్థితిని తెలుసుకుంటాను.

-పి.జగన్నాథరావు, డిప్యూటీ డైరెక్టర్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి

కేంద్ర దివాళాకోరు విధానాలపై రాజీలేని పోరాటం

ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆరో రాష్ట్ర మహాసభ ప్రారంభంలో ఎమ్మెల్సీ గోపిమూర్తి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎల్ఐసిలోని వేల కోట్ల రూపాయలను అదానీకి అప్పనంగా అప్పగించిన కేంద్ర ప్రభుత్వ దివాళాకోరు ఆర్థిక విధానాలపై రాజీలేని పోరాటం సాగించాలని ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్సి బి గోపీమూర్తి పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా సీతారామ భర్తీయా కల్యాణ మండపంలో ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆరో రాష్ట్ర మహాసభ ఆదివారం ఘనంగా జరిగింది.

తొలుత ఎల్ఐసి ఎఒఐ రాష్ట్ర అధ్యక్షులు టి కోటేశ్వరరావు సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. ఇన్సూరెన్స్ కంపెనీల ప్రయివేటీకరణ నిలుపుదల చేయాలని, ప్రజాధనాన్ని కాపాడాలని, కార్పొరేట్ అనుకూల విధానాలు విడనాడాలని ప్రతినిధులు నినదించారు. అనంతరం జరిగిన ప్రారంభ సభలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ గోపిమూర్తి హాజరై మాట్లాడారు.

అమెరికా వాషింగ్టన్ పోస్ట్ కథనం ప్రకారం ఎల్ఐసి ధనం రూ.33 వేల కోట్లు అదానీ కంపెనీకి చెల్లించేందుకు జరిగిన చర్చల వివరాలు వెలుగులోకి రావడం దేశ ప్రజలను ఆందోళన గురిచేస్తోందన్నారు. ప్రజలు మౌనంగా ఉంటే ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదని, పోరాటంతోనే హక్కులను, ఆస్తులను కాపాడుకోవచ్చని పిలుపునిచ్చారు. ఏఐఇఐఎ సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షులు పి సతీష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 15 లక్షల మంది ఎల్ఐసి ఏజెంట్లు ప్రజలను ఒప్పించి ఎల్ఐసిలో ఖాతాదారులుగా మార్చడం ద్వారా సృష్టించిన సంపదపై కార్పొరేట్ల కన్ను పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ మాజీ డిప్యూటీ మేయర్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు మాట్లాడు తూ జనవరిలోనే అదాని గ్రూపు కంపెనీలో ఎల్ఐసి పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెడితే ఖాతాదారు ఓలకు ఓగాని, దేశ ప్రజలకుగాని తెలియకుండా కేంద్ర ప్రభుత్వం దొంగచాటు వ్యవహారాలు నడుపుతోందని దుయ్యబట్టారు. ఆల్ ఇండియా ఎల్ఐసి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్ మంజునాథ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎల్ఐసి ఏజెంట్ల సంక్షేమం కోసం తమ సంఘం కృషి చేస్తోందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ కొద్దిమంది వ్యక్తుల చేతుల్లో బందీగా మార్చడంలో మోడీ సఫలమయ్యారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సౌత్ సెంట్రల్ జోన్ ప్రధాన కార్యదర్శి పిఎల్ నరసింహారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి రవికిషోర్, రాజమండ్రి డివిజన్ మార్కెటింగ్ మేనేజర్ కె వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్, నగర అధ్యక్ష కార్యదర్శులు వైఎస్ కనకారావు, ఎం ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

తుపాను సహాయక చర్యల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులు

- టిఆర్-27 కింద రూ.19 కోట్లు నిధులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'మొంథా' తుపాను నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ముందస్తు చర్యలు తీసుకునేందుకు వీలుగా జిల్లాలకు ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది. సమన్వయ బాధ్యతలను సీనియర్ ఐఎఎస్ అధికారులైన సిసోడియా, అజయ్‌జైన్‌కు అప్పజెప్పింది. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు విడుదల చేసింది. సిసోడియా తూర్పుతీర ప్రాంతాల జోనల్ ఇన్‌ఛార్జిగా పశ్చిమ గోదావరి జిల్లా నుంచి చిత్తూరు వరకు సహాయక చర్యలను పర్యవేక్షించనున్నారు. అజయ్‌జైన్ శ్రీకాకుళం నుంచి అంబేద్కర్ కోనసీమ జిల్లాల వరకు పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించనున్నారు.

జిల్లాల వారీ ప్రత్యేకాధికారుల నియామకం

కెవిఎన్ చక్రధర్‌బాబు (శ్రీకాకుళం), పట్టణశెట్టి రవిసుభాష్ (విజయనగరం), నారాయణ భరత్‌గుప్తా (మన్యం), వాడరేవు వినయ్‌చంద్ (ఎఎస్ఆర్), కె కన్నబాబు (తూర్పుగోదావరి), విఆర్ కృష్ణతేజ (కాకినాడ) విజయరామరాజు (అంబేద్కర్ కోనసీమ), వి ప్రసన్న వెంకటేష్ (పశ్చిమ గోదావరి), కాంతిలాల్ దండే (ఏలూరు), ఆమ్రపాళి (కృష్ణా), శశిభూషణ్‌కుమార్ (ఎన్‌టిఆర్), ఎం వేణుగోపాల్‌రెడ్డి (బాపట్ల), కోన శశిధర్ (ప్రకాశం), ఎన్ యువరాజ్ (నెల్లూరు), పి అరుణ్‌బాబు (తిరుపతి), పిఎస్ గిరీశా (చిత్తూరు) జిల్లాలకు ప్రత్యేకాధికారులుగా ప్రభుత్వం నియమించింది. వీరందరూ అన్ని శాఖల మధ్య సమన్వయం నెలకొల్పుతూ పని చేయాలని సూచించింది.

విపత్తుల నిర్వహణ శాఖ టిఆర్-27 కింద రూ.19 కోట్లు తుపాను ప్రభావిత ప్రాంతాలకు నిధులను మంజూరు చేసింది. తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, పశ్చిమ గోదావరి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలకు రూ.కోటి చొప్పున, చిత్తూరు, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల, గుంటూరు, పల్నాడు, ఎన్‌టిఆర్, ఏలూరు, తూర్పుగోదావరి, ఎఎస్ఆర్, పార్వతీపురం మన్యం జిల్లాలకు రూ.50 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు.

అసైన్డ్ భూములపై నిషేధాన్ని తొలగించొద్దు

- మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయానికి ఎపి వ్యకాస ఖండన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అసైన్డ్ భూములపై నిషేధాన్ని తొలగించొద్దని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) డిమాండ్ చేసింది. అసైన్డ్ భూములపై నిషేధాన్ని తొలగిస్తామని మంత్రివర్గ ఉపసంఘం ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గడిచిన 5 దశాబ్దాలుగా ప్రభుత్వాల నుంచి లబ్ధి పొందిన దళిత, బలహీన తరగతులకు చెందిన అసైన్డ్ భూములను పలుకుబడి కలిగిన వారికి, గ్రామీణ సంపన్నులకు కట్టబెట్టడానికే ఈ నిషేధాన్ని ఎత్తివేయడానికి రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములపై సమగ్ర విచారణ జరిపి అక్రమంగా స్వాధీనం చేసుకున్న పెత్తందారుల నుంచి భూములు వెనక్కు తీసుకుని తిరిగి పేదలకు ఇస్తామని సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన అనంతరం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశారని, రెండు పర్యాయాలు రెవెన్యూ సదస్సులు నిర్వహించారని, అనర్హుల చేతుల్లో ఉన్న అసైన్డ్ భూములను పేదలకు అప్పగించలేదన్నారు.

డిమాండ్ల సాధనలో వెనకడుగు వేయం

- ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డిమాండ్ల సాధన, సమస్యల పరిష్కారంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు ఎ విద్యాసాగర్ తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంతో జరిపిన చర్చలు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో అడుగు ముందుకు పడిందన్నారు. విజయవాడ గాంధీనగర్ ఎపి ఎన్‌జిఒ హోమ్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు దాదాపు వేలకోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను గత ప్రభుత్వం కోత విధించిందన్నారు. ఆర్‌టిసిలో ఉద్యోగోన్నతులకు ఉత్తర్వులివ్వడం సంతోషదాయకమన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ, నాయకులు కె జగదీశ్వరరావు, జానకి రాజ్యలక్ష్మి, సరస్వతి , డిఎస్ఎన్ రెడ్డి, వివి ప్రసాద్, సిపిఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సిఎం దాస్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జానీ పాషా పాల్గొన్నారు.

జమ్మలమడుగులో వృద్ధజంట హత్య

ప్రజాశక్తి- జమ్మలమడుగు (వైఎస్ఆర్ జిల్లా)

వృద్ధ జంట హత్యకు గురైన సంఘటన వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగు శివారులో ఆదివారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దపసుపల మోటుకు చెందిన కె నాగప్ప (60) పట్టణంలోని మైలవరం బైపాస్-రోడ్డు సమీపంలోనున్న సిమెంట్ ఇటుకల బట్టిని నడుపుతున్నారు. ఆయనకు భార్య ఓబులమ్మ, ఇద్దరు కుమారులు పెద్ద వెంకటేశ్వర్లు, చిన్న వెంకటేశ్వర్లు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులకు తెలిసే నాగప్ప 30 ఏళ్లుగా మరో మహిళ పెద్దక్క (50)తో ఇటుకుల బట్టి వద్దే సహజీవనం సాగిస్తున్నారు. నాగప్ప భార్య కుమారులతో కలిసి జమ్మలమడుగులో నివాసముంటున్నారు. శనివారం రాత్రి ఇటుకల బట్టి వద్దనున్న ఇంటి బయట నాగప్ప, పెద్దక్కలు నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కర్రతో ఇద్దరి తలపై గట్టిగా కొట్టి చంపారు. డిఎస్‌పి వెంకటేశ్వర్లు ఆదివారం ఉదయం సంఘటనా స్థలానికి వెళ్లి హత్యపై ఆరా తీశారు. మృతదేహాల వద్ద డ్వాగ్ స్క్వాడ్ పరిశీలించింది. మృతుల ఇంటి తలుపులు, బీరువా పగులగొట్టినట్లు ఆనవాలు ఉన్నాయని, ఇంట్లో మొత్తం కారం, ధనియాల పొడిని చల్లినట్లు డిఎస్‌పి తెలిపారు. హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు, హంతకులను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. చిన్న కుమారుడు వెంకటేశ్వర్లు అనుమాన స్పదంగా ఉండడంతో అదుపులో తీసుకున్నట్లు సమాచారం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

నిరసన ర్యాలీలు 4వ తేదీకి వాయిదా

- వైసిపి అధినేత వైఎస్ జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా ఈ నెల 28న వైసిపి తలపెట్టిన ర్యాలీలను తుపాను కారణంగా వచ్చే నెల 4వ తేదీ నాటికి వాయిదా వేస్తున్నట్లు వైసిపి అధినేత వైఎస్ జగన్ వెల్లడించారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఈ నెల 28న ర్యాలీల నిర్వహణకు గతంలో పార్టీ పిలుపునిచ్చినట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొంథా తుపాను నేపథ్యంలో తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు అవసరమైన ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు, సహాయ, పునరావాస చర్యల్లో ప్రజలకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు.

గంగపుత్రుల జీవితాలను నాశనం చేయొద్దు

- ఐలు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర రాజేంద్ర ప్రసాద్
- బల్క్ డ్రగ్ వ్యతిరేక పోరాట శిబిరాన్ని న్యాయవాదుల బృందంతో కలిసి సందర్శన



బల్క్ డ్రగ్ పార్కు వ్యతిరేక పోరాట శిబిరం వద్ద సంఘీభావం తెలుపుతూ కూర్చున్న రాజేంద్ర ప్రసాద్, న్యాయవాదులు

ప్రజాశక్తి - నక్కపల్లి (అనకాపల్లి)

అభివృద్ధి పేరిట గంగపుత్రుల జీవితాలను నాశనం చేస్తున్నారని, సామాన్య ప్రజలను ఊర్ల నుంచి తరిమేస్తున్నారని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర రాజేంద్ర ప్రసాద్ అన్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకొని అనారోగ్యాలకు గురై ప్రజలు చనిపోతున్నారని, అవి ప్రభుత్వ హత్యలని పేర్కొన్నారు. నక్కపల్లి మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్‌డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు చేపట్టిన ఆందోళన శిబిరాన్ని ఆదివారం 16 మంది న్యాయవాదులతో కూడిన బృందంతో ఆయన సందర్శించారు. మత్స్యకారులు తమ ఇబ్బందులను బృందం దృష్టికి తీసుకెళ్లారు. వారికి మత్స్యకారులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కోనసీమ వంటి ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్న ఈ ప్రాంతంలో అభివృద్ధి పేరుతో ముప్పు ఎందుకు తలపెడుతున్నారని ప్రశ్నించారు. 2010లో ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఓ మందుల కంపెనీ స్వీయ అనుభవం ఏం చెబుతోందన్నారు. ఆ కంపెనీ పెట్టిన తర్వాత గతంలో రాని రోగాలు వస్తున్నాయని తెలిపారు. వృద్ధ వయసు రాకుండానే పలువురు మృతి చెందుతున్నారని, కాలుష్యం లేకపోతే ఇన్ని అనర్థాలు ఎందుకు జరుగుతున్నాయని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 43 రోజులుగా రాజయ్యపేటలో మత్స్యకారులు ఆందోళన చేస్తుంటే బయటివారు మద్దతునీయకుండా పోలీసులు ఆంక్షలు పెట్టడం దారుణమన్నారు. గ్రామానికి వచ్చే వారికి ఆధార్ కార్డు లేకుంటే పోలీసులు రానివ్వడం లేదని తెలిపారు. చట్టాలను ఉల్లంఘించి పనులు చేస్తున్న వారిని ఎర్ర తివాచీలు వేసి ఆహ్వానిస్తున్నారని, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిపై అనేక ఆంక్షలు పెట్టి, ఇబ్బందులకు చేస్తున్నారని విమర్శించారు. బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా పోరాడుతున్నవారికి న్యాయపరంగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు చేస్తున్న పోరాటాన్ని మీడియా ద్వారా తెలుసుకుని వచ్చామన్నారు.



ముళ్ళ పొదల్లోకి దూసుకొనెల్లిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు

ముళ్ల పొదల్లోకి దూసుకు వెళ్లిన

- ప్రైవేట్ ట్రావెల్ బస్సు

ప్రజాశక్తి- మార్కాపురం రూరల్ (ప్రకాశం జిల్లా)

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి ముళ్ల పొదల్లోకి దూసుకువెళ్లింది. ప్రకాశం జిల్లా మార్కాపురం మండలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం... ఆర్‌వివిటి అనే ప్రైవేట్ ట్రావెల్ బస్సు మార్కాపురం నుండి బెంగళూరు వెళ్తుండగా వేములకోట గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ సమయంలో బస్సులో ఎనిమిది మంది ప్రయాణికులు, ముగ్గురు సిబ్బంది ఉన్నారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టమూ జరగకపోవడంతో అందరూ ఊపిరి పిలుచుకున్నారు. మార్కాపురం పట్టణంలో ఈ బస్సు బయలుదేరుతున్నప్పుడు మార్కాపురం సర్కిల్ ఇనస్పెక్టర్ పి.సుబ్బారావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎ.మాధవరావు తనిఖీలు నిర్వహించారు. ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని బస్ డ్రైవర్‌కు సూచించారు. ఆ తర్వాత అరగంటలోనే ఈ ప్రమాదం చోటు చేసుకోవడం చర్చనీయాంశమైంది.

ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలి

- స్కూల్ టీచర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఎపి ఎస్‌టిఎ) కోరింది. ఈ మేరకు ఆ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె శ్రీనివాసులు, టి చందనరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో రివ్యూ పిటిషన్ దాఖలు చేయకుండా హడావుడిగా టెట్ నోటిఫికేషన్ జారీ చేయడం అన్యాయమని, తక్షణమే దీనిని నిలుపుదల చేయాలని కోరారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని విద్యాహక్కు చట్టం-2009లోని సెక్షన్ 23ను సవరించేలా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిస్థితిని చక్కదిద్దేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. 20-30 ఏళ్ల సర్వీసు ఉన్న ఉపాధ్యాయులకు ఇప్పుడు టెట్ నిర్వహించడమేంటని ప్రశ్నించారు. టెట్ సిలబస్ కూడా అసమంజసంగా ఉందన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సెలవులు రద్దు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'మొంథా' తుపాను నేపథ్యంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం మూడు రోజులు సెలవులను రద్దు చేసింది. అత్యవసర విధుల నేపథ్యంలో ఈ నెల 26 నుంచి 29 వరకు ఉద్యోగులకు సెలవులు మంజూరు చేయొద్దని జిల్లా కలెక్టర్లకు ఆ శాఖ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఐసిడిఎస్‌లో 'షోకాజ్'ల కలకలం

రాష్ట్ర వ్యాప్తంగా 23 మంది సిడిపిఒలు, 22 మంది సూపర్‌వైజర్లకు నోటీసులు

ప్రజాశక్తి- విజయనగరం కంటోన్మెంట్

సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకం (ఐసిడిఎస్)లో షోకాజ్ నోటీసుల కలకలం రేగింది. రాష్ట్ర వ్యాప్తంగా భారీ స్థాయిలో సిడిపిఒలు, సూపర్‌వైజర్లకు ప్రభుత్వం నోటీసులు జారీ చేయడమే అందుకు కారణం. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఈ నోటీసులో రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. పూర్తి కారణాలతో సమాధానాలు ఇవ్వకుంటే కఠిన చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఏడు నెలల నుంచి ఆరేళ్ల వయసున్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలి. ఐసిడిఎస్ ప్రాజెక్టు స్థాయిలో సిడిపిఒలు, సెక్టార్ స్థాయిలో సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించాలి. ఈ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ, పిల్లల ఎదుగుదల, రక్తహీనత లోపాలు, తదితర అంశాలను తెలుసుకోవాలి. పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ రాష్ట్రంలోని 23 మంది సిడిపిఒలకు, 22 మంది సూపర్‌వైజర్లకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. నోటీసు అందిన వారం రోజుల్లోగా వైఫల్యానికి కారణాలు, తీసుకున్న దిద్దుబాటు చర్యలపై లిఖిత పూర్వకంగా వివరణ ఇవ్వాలని, నిర్ణీత సమయంలోపు స్పందించడంలో విఫలమైతే తీవ్రంగా పరిగణించి క్రమశిక్షణ చర్యలు తీసుకోకుంటామని ఈ షోకాజ్ నోటీసులో హెచ్చరించారు. షోకాజ్ నోటీసులు అందుకున్న సిడిపిఒల్లో అన్నమయ్య జిల్లాకు సంబంధించి ఐదుగురు, అనంతపురం జిల్లా నలుగురు, ఏలూరు జిల్లా ముగ్గురు, నంద్యాల జిల్లాకు సంబంధించి ఇద్దరు, గుంటూరు, కర్నూలు, పార్వతీపురం మన్యం, పల్నాడు, తిరుపతి, విజయనగరం, ప్రకాశం, శ్రీసత్యసాయి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. షోకాజ్ నోటీసులు అందుకున్న సూపర్‌వైజర్లలో అనంతపురం జిల్లాకు సంబంధించి ఐదుగురు, అన్నమయ్య జిల్లాకు సంబంధించి నలుగురు, ఏలూరు జిల్లాకు సంబంధించి ముగ్గురు, గుంటూరు, కర్నూలు, పార్వతీపురం మన్యం, పల్నాడు, నంద్యాల, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, శ్రీసత్యసాయి, తిరుపతి, విజయనగరం జిల్లాలకు సంబంధించి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు.

కర్నూలు బస్సు ప్రమాదంలో గుడిపల్లి వాసి మృతి

ప్రజాశక్తి- గుడిపల్లి (చిత్తూరు జిల్లా):



కర్నూలు బస్సు ప్రమాదంలో చిత్తూరు జిల్లా గుడిపల్లి (ఎం) యామిగానిపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత త్రిమూర్తి (58) మృతి చెందారు. డిఎన్‌ఎ పరీక్షలతో గుర్తింపు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. త్రిమూర్తి బుధవారం హైదరాబాదులోని బంధువుల వివాహానికి కుప్పం నుంచి బయలుదేరి వెళ్లారు. గురువారం రాత్రి హైదరాబాదు - బెంగళూరు కావేరీ ట్రావెల్స్ బస్సులో బయలుదేరినట్లు కుటుంబ సభ్యులకు త్రిమూర్తి ఫోన్ చేసి చెప్పారు. ఆయన ఫోన్ హైదరాబాద్ నుండి కర్నూలు శివారు చిన్నటేకూరు వరకు సిగ్నల్ ఉందని, తరువాత ఎటువంటి సమాచారం లేకపోవడంతో త్రిమూర్తి కుమారుడు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో డిఎన్‌ఎ పరీక్ష ద్వారా త్రిమూర్తి మృతదేహాన్ని గుర్తించి ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. సోమవారం ఉదయం అంత్యక్రియల నిమిత్తం స్వగ్రామం యామిగానిపల్లికి తీసుకువెళుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గుడిపల్లి మండలంలో ఆయనకు క్వారీ ఉంది.

కాంట్రాక్టు లెక్చరర్ల రెగ్యులరైజేషన్ పున:ప్రారంభించండి

- సదస్సులో పిడిఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి
- అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను వెంటనే పున:ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బి గోపిమూర్తి డిమాండ్ చేశారు. కాంట్రాక్టు లెక్చరర్ల రెగ్యులరైజేషన్ కోసం చేసిన చట్టం రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రెగ్యులరైజేషన్ ప్రక్రియ పున: ప్రారంభించాలని కోరుతూ విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆదివారం రాష్ట్ర సదస్సు జరిగింది. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ కాలేజీస్ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో గోపిమూర్తి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం జిఒ 114ను తీసుకొచ్చి కొన్ని శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేసిందని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తయినా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ కారణంగా చివరి దశలో నిలిచిపోయిన లెక్చరర్లను క్రమబద్ధీకరించే ప్రక్రియను పున:ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జిఒ 114 ద్వారా గత ప్రభుత్వం 10,117 మంది ఉద్యోగులను, అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసేందుకు అర్హులుగా గుర్తించిందన్నారు. ఆచరణలో 3 వేల మందిని మాత్రమే చేసిందన్నారు. అధికారంలోకి వస్తే క్రమబద్ధీకరిస్తామని ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి పట్టించుకోవడం లేదన్నారు. పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ మాట్లాడుతూ.. కాంట్రాక్టు లెక్చరర్ల న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2024, 2025 మే నెల వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీస్‌ను ప్రభుత్వం రెగ్యులరైజేషన్ చేసేంత వరకు అండగా ఉంటామని చెప్పారు. ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచి న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం దిగిరాకపోతే నవంబరు, డిసెంబరులో దశల వారీ ఆందోళనలు నిర్వహించాలని సదస్సు నిర్ణయించింది. ప్రభుత్వం అప్పటికీ దిగిరాకపోతే ఇంటర్ పరీక్షలు బహిష్కరించాలని నిర్ణయించింది. కార్యక్రమం అనంతరం నోటికి నల్లరిబ్బన్ కట్టుకుని బందర్ రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్దకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం అక్కడ కొంతసేపు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా పరిరక్షణ సమితి ఛైర్మన్ రాజగోపాల్, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాంట్రాక్టు లెక్చరర్ల రాష్ట్ర నాయకులు వై జాన్‌బాబు, మాణిక్యం గౌర్ల, బిజె గాంధీ, దాసరి రాజు, కలగాని శ్రీనివాస యాదవ్, సుందరావు, సాయిరాజు, స్వాతి, దుర్గా మల్లీశ్వరి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జల వివాదాలను జటిలం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

కడప రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - కడప అర్బన్

నీటి వివాదాలను కేంద్ర ప్రభుత్వం జటిలం చేస్తోందని వక్తలు అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆలోచనపరుల వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఐపిఎస్ అధికారి ఎ.బి.వెంకటేశ్వరరావు, రైతు సేవా సంస్థ అధ్యక్షులు అక్కినేని భవానీ ప్రసాద్, జలవనరులు సాగునీటి ప్రాజెక్టుల విశ్లేషకులు టి.లక్ష్మీనారాయణ, పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసి రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ప్రసంగించారు. నీటి వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపి, ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులు పూర్తి చేయాల్సిన పాలక ప్రభుత్వాలు కాంట్రాక్టర్ల కడుపు నింపడానికి ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు.

ప్రాజెక్టుల పూర్తి కోసం, నికరజలాల సాధనే లక్ష్యంగా ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. ఇద్దరు ముఖ్యమంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న కడప, చిత్తూరు జిల్లాల జీవనాడి అయిన గాలేరు నగరి సుజల స్రవంతి పనులు నిధుల లేమి, అటవీ అనుమతుల మంజూరులో జాప్యంతో ఆగిపోయాయని విమర్శించారు. రెండో దశలో కడప నుంచి నగరి వరకు జరగాల్సిన పనులు పూర్తి కాకుండానే హంద్రీనీవా రెండో దశ అనుసంధానం పేరుతో నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. గాలేరు నగరి సుజల స్రవంతి వంద శాతం గ్రావిటీ కలిగిన ప్రాజెక్టు అన్నారు. కేవలం రూ.4,500 కోట్లు ఖర్చు చేస్తే రెండు లక్షల 75 వేల ఎకరాలకు సాగునీరు, పది లక్షల మందికి తాగునీరు అందించే ప్రాజెక్టును అటకెక్కించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టు పేరుతో రాయలసీమ ప్రాజెక్టులపై పొరుగు రాష్ట్రాల వివాదాలకు ఆజ్యం పోయడమేనన్నారు. కృష్ణా నీటి వివాదాలపై ఏర్పాటైన బచావత ట్రిబ్యునల్ తీర్పు శిరోధార్యమన్నారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వి.సుబ్బారెడ్డి, పి.భాస్కర్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



పాపవినాశనం డ్యామ్ వద్ద ప్రత్యేక పూజల్లో టిటిడి ఛైర్మన్ బిఆర్.నాయుడు

తిరుమలలో నిండుకుండలా జలాశయాలు

ప్రజాశక్తి - తిరుమల

గత కొన్ని రోజులుగా తిరుమలలో కురిసిన వర్షాలతో జలాశయాలు నిండుకుండను తలపిస్తున్నాయి. నీటి నిల్వలు పూర్తిస్థాయికి చేరుకోవడంతో పాపవినాశనం డ్యామ్ వద్ద ఆదివారం టిటిడి ఛైర్మన్ బిఆర్.నాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించి గంగ హారతి సమర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ తిరుమలలోని జలాశయాలు 95 శాతం నిండిపోవడం శుభపరిణామం అని సంతోషం వ్యక్తం చేశారు. పాపవినాశనం, గోగర్భం డ్యామ్‌లు పూర్తిగా నిండిపోవడంతో గేట్లు తెరిచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. యాత్రికుల కోసం తిరుమలలో ప్రతిరోజూ 50 లక్షల గ్యాలన్ల నీరు అవసరమవుతుండగా తిరుపతిలోని కల్యాణి డ్యామ్ నుండి 25 లక్షల గ్యాలన్లు, తిరుమలలోని డ్యామ్‌ల నుండి 25 లక్షల గ్యాలెన్ల నీటిని వినియోగిస్తున్నామన్నారు. తిరుమలలో 250 రోజుల నీటి అవసరాలకు సరిపడే నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డ్యాములను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నీటి అవసరాలను సక్రమంగా నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ శాఖను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. టిటిడి చరిత్రలో రికార్డు స్థాయిలో మొదటిసారి ఈ ఏడాది భారీ విరాళాలు వచ్చాయని తెలిపారు. గడిచిన 11 నెలల కాలంలో టిటిడి ట్రస్టులకు రూ.918 కోట్లు విరాళాలు అందాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టిటిడి సిఇ సత్యనారాయణ, ఇఇలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, సుధాకర్, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, విజిఒ సురేంద్ర పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న సిబిడిటి ఛైర్మన్

ప్రజాశక్తి - తిరుమల

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సిబిడిటి) ఛైర్మన్ రవి అగర్వాల్ ఆదివారం ఉదయం కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు టిటిడి ఛైర్మన్ బిఆర్.నాయుడు దర్శన ఏర్పాటు చేసి రంగనాయకుల మండపంలో స్వామివారి శేషవస్త్రం కప్పి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఏటికేడూ పెరిగిపోతున్న వ్యర్థాలు

- ఏటా 3.88 కోట్ల టన్నుల చెత్త
- ప్లాస్టిక్ వేస్ట్ 1.2 లక్షల టన్నులు



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో వ్యర్థాలు భారీగా పెరుగుతున్నాయి. ఏటా తయారవుతున్న వ్యర్థాలపట్ల అధికారులే ఆందోళన చెందుతున్నారు. తాజా అంచనాల మేరకు రాష్ట్రంలో ఏటా 3.88 కోట్ల టన్నుల వరకు వ్యర్థాలు ఉంటున్నట్లు ఒక నివేదికలో వెల్లడైంది.. కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన ఈ నివేదిక ప్రకారం మొత్తం వ్యర్థాల్లో ఎక్కువగా పశువుల పేడ, కోళ్ల నుంచి వచ్చేవి, ఇతర లైవ్ స్టాక్ నుంచి వచ్చే వచ్చే వ్యర్థాలే అత్యధికంగా ఉంటాయని చెబుతున్నారు. ఇవే 3.35 కోట్ల టన్నుల వరకు ఉంటాయని ప్రభుత్వం చెబుతోంది. ఇక పంటల కోతల అనంతర వ్యర్థాలు 40 లక్షల టన్నులు ఉంటాయని చెబుతుండగా, ఎప్పటి నుంచో చర్చనీయాంశంగా మారిన ప్లాస్టిక్ వ్యర్థాలు, వాహన కాలుష్యం కలిపి 1.2 లక్షల టన్నుల వరకు ఉంటాయని చెబుతున్నారు. పారిశ్రామిక, వాహనాల్లో వినియోగించే బ్యాటరీల ద్వారా 36 వేల టన్నులు, వాటిల్లో వినియోగించే ఇంధనం ద్వారా మరో 24 వేల టన్నుల వ్యర్థం ఉత్పన్నమవుతోందని, సాధారణ మందుల ద్వారా వచ్చేది వెయ్యి టన్నులు, మత్స్య రంగం, ఇతర రంగాల ద్వారా 12 వేల టన్నుల వ్యర్థం ఉత్పన్నమవుతున్నట్లు చెబుతున్నారు. ప్రతియేటా ఎన్ని చర్యలు తీసుకున్నా కూడా ఈ భారీ వ్యర్థాల సమస్య తగ్గడం లేదని అధికారులు అంటున్నారు.

వివిధ రంగాల ద్వారా వచ్చే వ్యర్థాలను రీసైకిలింగ్ చేసేందుకుగాను రాష్ట్రంలో అనేక యూనిట్లను నెలకొల్పారు. పారిశ్రామిక వ్యర్థాల కోసం 1.92 లక్షల టన్నులను రీసైక్లింగ్ చేసేందుకు 13 యూనిట్లు ఏర్పాటుచేశారు. ఇలా రీసైక్లింగ్ చేసిన వాటిని సిమెంట్ పరిశ్రమల్లో వినియోగించే అవకాశాలు ఉంటాయి. అలాగే సల్ఫరిక్ యాసిడ్ రీసైక్లింగ్ కోసం మూడు యూనిట్లు, పంట వ్యర్థాల కోసం ఒకటి, టైర్ల వ్యర్థాలకు 28 యూనిట్లను ఏర్పాటుచేశారు. ఇవి ఎంతవరకు సక్రమంగా పనిచేస్తున్నాయన్న లెక్కలు అధికారుల వద్ద కూడా లేనట్లు తెలుస్తోంది.

జిల్లా అధికారులకే బాధ్యతలు

భారీగా వెలువడుతున్న వ్యర్థాలను తగ్గించే, రీసైక్లింగ్ చేసే బాధ్యతలను జిల్లా అధికారులకే అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వ్యర్థాలు ఎక్కువగా ఎక్కడి నుంచి వస్తున్నాయో గుర్తించే పనిని కలెక్టర్లకు అప్పగించారు. అలాగే ఆ వ్యర్థాలను రీసైక్లింగ్ చేసేందుకు అనువైన స్థలాలను గుర్తించడం, రీసైక్లింగ్ యూనిట్లను ఏర్పాటుచేసేందుకు ఆసక్తి కల వారిని ప్రోత్సహించడం, తరచూ ఈ అంశాలపై సమీక్షలు నిర్వహించడం ద్వారా వ్యర్థాలను తగ్గించే ప్రక్రియ వేగవంతం చేయాలని నిర్దేశించారు.



కర్నూలు సుందరయ్య సర్కిల్‌లో నిరసన ప్రదర్శననుద్దేశించి మాట్లాడుతున్న ఎవి.నాగేశ్వరరావు

ఎల్ఐసి సొమ్ము అదానీకి కట్టబెట్టొద్దు

- కర్నూలు నిరసన ప్రదర్శన లో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఎల్ఐసికి చెందిన కోట్లాదిమంది ప్రజల పాలసీ డబ్బు రూ.34 వేల కోట్లు అదానీకి కట్టబెట్టాలనే ఆలోచనను మోడీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కర్నూలు సుందరయ్య సర్కిల్లో సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ అధ్యక్షతన ఆదివారం నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఎవి.నాగేశ్వరావు మాట్లాడుతూ ఆదివారం పత్రికల్లో వచ్చినట్లు ఎల్ఐసికి చెందిన కోట్లాది మంది పాలసీదారుల రూ.34 కోట్లను అదానికి కట్టబెట్టడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుంటే సిఐటియు ప్రజాఉద్యమాన్ని చేపట్టి అడ్డుకుంటుందని హెచ్చరించారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి కార్పొరేట్లకు సేవ చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. కేవలం రూ.500 కోట్ల ప్రభుత్వ పెట్టుబడితో మొదలైన ఎల్ఐసి నేడు దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా కూడా అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజల నమ్మకాన్ని చూరగొని రూ.వేల కోట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డివిడెంట్ల రూపంలో ఇస్తూ లక్షలాదిమందికి ఉపాధి కల్పిస్తున్న పెద్ద సంస్థ అని తెలిపారు.

ఆ సంస్థను నీరు కార్చడానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. హెడేన్ బర్గ్ రిపోర్ట్ ప్రకారం అదాని అక్రమాలపై విచారణ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు మాట్లాడారు.

దయనీయంగా గిరిజన పాఠశాలలు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య
- తక్షణ చర్యలకు డిమాండ్ - సిఎంకు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గిరిజన సంక్షేమ, ఆశ్రమ, గురుకుల, ఏకలవ్య, పాఠశాలల పరిస్థితి దయనీయంగా ఉందని, తక్షణమే వీటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య లేఖ రాశారు. గిరిజన సంక్షేమానికి తగిన నిధులు కేటాయించాలని కోరారు. విద్యతో పాటు నాణ్యమైన పౌష్టికాహారం అందాల్సిన గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పిల్లలు అనారోగ్యం పాలై విగత జీవులుగా మారడం బాధాకరమన్నారు. ఏటా రాష్ట్ర వైద్యారోగ్యశాఖ నిర్వహిస్తున్న వైద్య పరీక్షల్లో వందల మంది గిరిజన బాలబాలికలు రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తింపబడినప్పటికీ శాశ్వత నివారణకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యమన్నారు.

సంక్షేమ పాఠశాలల్లో మౌలిక వసతులపై దృష్టి

- కాంగ్రెస్ పార్టీ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంక్షేమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలని ప్రభుత్వాన్ని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఏజెన్సీ బడుల్లో పిల్లల వరుస మరణాలు ఆందోళన కరమని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇవి ప్రభుత్వ హత్యలుగానే పరిగణించాలన్నారు. చంద్రబాబు 16 నెలల పాలనలో 21 మంది పిల్లలు చనిపోయారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. వరుస మరణాలు కూటమి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు.

మతం ముసుగులో మహిళలపై దాడులు

విద్యతోనే వాటిని రూపుమాపగలం

ఐద్వా కోశాధికారి ఎస్ పుణ్యవతి



ఎస్ పుణ్యవతి

ప్రజాశక్తి- అనంతపురం

'మతం ముసుగులో మహిళలపై దాడులు జరుగుతున్నాయి. మహిళలు విద్యావంతులుగా తయారయినప్పుడే వాటిని రూపుమాపగలం. మూఢవిశ్వాసాలు, సనాతన ధర్మం, మతాలు రక్షణ కల్పిస్తాయనే భావనను తొలగించాలి. వీటన్నింటిని ఎదుర్కోవాలంటే విద్యతోపాటు, మహిళల్లో శాస్త్రీయ అవగాహన పెంచాలి' అని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) కోశాధికారి ఎస్ పుణ్యవతి సూచించారు. అనంతపురంలో ఇటీవల జరిగిన ఐద్వా రాష్ట్ర మహాసభకు హాజరైన సందర్భంగా ఆమె 'ప్రజాశక్తి'తో ముచ్చటించారు.

పాలకుల విధానాలను ఎలా ఎదుర్కోవాలి?

13 గంటల పని విధానం మహిళల హక్కును హరిస్తుంది. 150 ఏళ్ల క్రితమే ఎనిమిది గంటల పని విధానం కావాలని పోరాడి సాధించుకున్న చరిత్ర మేడేకు ఉంది. ఈ రోజు ఆధునిక కంపెనీలు వచ్చి పని గంటలు పెంచాలనుకోవడం సరైంది కాదు. మాతృత్వం కాపాడుకోవాలని చెప్పే పాలకులు పని ప్రదేశంలో 13 గంటలు పని చేసే మహిళ తన కుటుంబ సభ్యులతో ఎలా ఉండగలుగుతుంది? అని ప్రశ్నించారు. పశ్చిమబెంగాల్‌లో వైద్య విద్యార్థిని అత్యాచార ఘటనపై సిఎం మమతా బెనర్జీ మాట్లాడుతూ ఆ డాక్టర్ ఎందుకు రాత్రివేళ బయటకు వెళ్లిందని ప్రశ్నించారు. నేను ఆమెను ఒకే ప్రశ్న అడుగుతున్నాను... చదువుకున్న అమ్మాయిలు, డాక్టర్లు, ఉద్యోగం చేసే మహిళలు రాత్రివేళ బయటికి పోకుండా ఎలా ఉంటారు? మహిళలకు రక్షణ కల్పించడం చేతగాక మహిళల బాధ్యతలపైన, వృత్తిపైన దాడి చేసే పద్ధతి అవలంబిస్తున్నారు. మహిళకు స్నేహితుడు ఉండకూడదా? స్నేహితురాల్లే ఉండాలని ఏమైనా చట్టం ఉందా? అని ప్రశ్నించారు.

మతం ముసుగులో మహిళలపై సాగుతున్న అణిచివేతను అడ్డుకోవడం ఎలా?

మతం ముసుగులో మహిళల చైతన్యాన్ని అడ్డుకుంటున్నారు. బాధలకు విముక్తి మతంలోనే ఉందని ప్రచారం చేస్తున్నారు. దీనిని అడ్డుకోవాలి. చదువుతోనే ఏది మంచి, ఏది చెడు అనేది తెలుస్తుంది. యోగివేమన, పోతులూరి వీరబ్రహ్మం లాంటి మహానుభావులు సమాజ హితం కోసం చెప్పిన విషయాలను సాంస్కృతిక కళారూపాల ద్వారా ప్రభుత్వాలు ప్రజలకు వివరించాలి. అన్నమయ్య... కులం అక్కర్లేదు, మతం అక్కర్లేదు అన్నారు. బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే మెండైన బ్రాహ్మణుడున్న మెట్టు భూమి ఒక్కటే. చెండాలుడు ఉండేటి తరి భూమి ఒక్కటే అని చెప్పారు. వీటన్నింటినీ ప్రభుత్వాలు సమాజం దృష్టికి తీసుకెళ్తే ఎందుకు మతాల వైపు మొగ్గుచూపుతారు.

మహిళల హక్కుల పరిరక్షణకు ఐద్వా కార్యాచరణ ఏమిటి?

కుటుంబాలు, ప్రభుత్వాలు, అధికారులు, యాజమాన్యాలు స్త్రీల హక్కులను గుర్తించకుంటే సమాజం బాగుపడదు. పురుషులతోపాటు స్త్రీలకు సమానత్వం అనేది సమాజ చైతన్యం కోసం, మార్పు కోసం దోహదపడుతుంది. మద్యం, గంజాయి, డ్రగ్స్‌ను నివారించాలని ప్రభుత్వాలను ఐద్వా తరపున డిమాండ్ చేస్తున్నాం. ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పని ప్రదేశంలో మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం. మహిళల హక్కులను కాపాడేందుకు భవిష్యత్తులో మరిన్ని బలమైన పోరాటాలు నిర్వహిస్తాం.

పరిశోధకులుగా మీరు సిద్ధమేనా?

బోధన, పరిశోధనా పోటీ పరీక్షల ప్రత్యేకం



-కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు
సెల్ : 8309965083

నవంబర్ 3 నుంచి 7 వరకూ ఏపిఆర్‌సెట్-2025 ప్రవేశ పరీక్షలు



సాంకేతికంగా పురోగమిస్తూ నూతన ఆవిష్కరణలకు వేదికైనప్పుడే ఏ దేశమైనా వేగంగా అభివృద్ధి చెందుతుంది. అందుకనే అనేక దేశాలు పరిశోధన, అభివృద్ధి(ఆర్అండ్‌డి)కి పెద్దపీట వేస్తున్నాయి. మనదేశం కూడా ఆ దిశగానే చర్యలు తీసుకోవాలి. లేకపోతే వెనుకబడిపోతాం. ఈ క్రతువులో పరిశ్రమలూ, పరిశోధనా సంస్థలూ, ఉన్నత విద్యాలయాలూ కలిసికట్టుగా క్రియాశీల పాత్ర పోషించాల్సివుంది. పరిశోధనలపై వెచ్చించే పెట్టుబడులు-భారతదేశాన్ని ఒక బలమైన, స్వయం సమృద్ధ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాయి. ఆవిష్కరణలను ప్రోత్సహించడం ద్వారా యువతలో మరింత నైపుణ్యత పెరుగుతుంది. కొత్త అంశాలను కనుగొంటారు. పరిశోధన-అభివృద్ధి వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా దేశీయంగా శాస్త్ర, సాంకేతిక సామర్థ్యాలు మరింతగా వెలుగులోకి వస్తాయి. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత కృషి పెంచాల్సివుంది. పరిశోధనలు, పరిశోధకులకు మరింతగా ప్రోత్సాహకాలు, రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాలి.

రాష్ట్ర ఉన్నత విద్యామండలి (ఎపిఎస్‌సిహెచ్ఇ) సౌజన్యంతో శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం (తిరుపతి) ఆధ్వర్యంలో నిర్వహించే ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎపిఆర్‌సెట్-2025) పరీక్షలు నవంబర్ 3 నుంచి 7వ తేదీ వరకూ జరగనున్నాయి. నవంబర్‌లో పరీక్ష తేదీలు, సమయం వంటి పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఇప్పటికే ఆ యూనివర్శిటీ నిర్వాహకులు ప్రకటించారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల పరిశోధక సీట్లలో ప్రవేశం పొందాలనుకుంటున్న అభ్యర్థులు ఈ పరీక్షకు ఇచ్చిన నోటిఫికేషన్‌తో ఇప్పటికే దరఖాస్తు చేసుకుని ప్రిపేరవుతున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో మోడల్‌పేపర్లు సైతం కొన్ని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు ఉంచుతున్నారు. గతంలో నిర్వహించిన ఆర్‌సెట్ పాతపేపర్లు సైతం అభ్యర్థులు కొంత డౌన్‌లోడ్ చేసుకుని మోడల్‌గా పరిశీలించుకుని ప్రిపేర్ అయితే మంచి మార్కులు సాధించటం సాధ్యమవుతుంది. ఉన్నత విద్య అంటే పోస్టుగ్రాడ్యుయేషన్ స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. అందువల్ల అభ్యర్థులు ఆ స్థాయిలో ప్రిపరేషన్‌ను బాగా చేయాల్సివుంటుంది. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నిర్వహణలో ఎంపిక చేసిన కేంద్రాల్లో ఈ ప్రవేశ పరీక్ష జరుగుతుంది. పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల పరిశోధన సీట్లలో ప్రవేశం పొందుతారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలల్లోని సీట్ల ఆధారంగా పిహెచ్‌డి ప్రోగ్రామ్‌లలో ప్రవేశం పొందుతారు. ఈ పరీక్ష అభ్యర్థుల పరిశోధన, విషయ పరిజ్ఞానం, విశ్లేషణాత్మక సామర్థ్యాల్లో నైపుణ్యాలను అంచనా వేస్తుంది. ఎంచుకున్న సంబంధిత సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ పూర్తయిన (ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, పిహెచ్‌సి వారికి 50 శాతం), ప్రొఫెషనల్ కోర్సులు, చివరి సంవత్సరం పోస్ట్‌గ్రాడ్యుయేషన్ ఫలితాలను ఆశిస్తున్న అభ్యర్థులకు కూడా దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం ఇచ్చారు.

పరిశోధనా దృక్పథం-విషయపరిజ్ఞానం కీలకం

పిహెచ్‌డి కోర్సుల్లో అడ్మిషన్ కోసం ప్రవేశ పరీక్ష రాస్తున్న వారు ముఖ్యంగా పరిశోధనా దృక్పథం, లోతైన విషయ పరిజ్ఞానం చాలా ముఖ్యం. ఈ పరీక్షే ప్రాథమిక ప్రవేశ ద్వారం. ఈ పరీక్ష పరిశోధనా దృక్పథంతో పాటు విషయ పరిజ్ఞానాన్ని కూడా అంచనా వేస్తుంది. పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారు పరిశోధకులుగా ఫుల్‌టైమ్ (ఎఫ్‌టి), పార్ట్‌టైమ్ (పిటి) విభాగాల్లో పరిశోధనలను ఎంచుకోవచ్చు. ఇది పూర్తిచేసి అధ్యాపక వృత్తిని ఎంచుకోవచ్చు. సైన్స్, ఆర్ట్స్, హ్యూమానిటీస్, సోషల్ సైన్స్, ఫైన్ ఆర్ట్స్, ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్, కామర్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, లా, ఫార్మాస్యూటికల్ సైన్స్ వంటి కోర్సుల్లో మొత్తంగా 67 సబ్జెక్టు అంశాల్లో (కొన్ని సబ్జెక్టులకు అంతర్గత అంశాలు కూడా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రిజర్వేషన్లు అమలవుతాయి. ఎపిఆర్‌సెట్ కమిటీ నిర్ణయాలకు అనుగుణంగా పరీక్షలు-ఫలితాల విడుదల వంటివి జరుగుతాయి.

ముఖ్యమైన విషయాలు

ఎడ్యుకేషనల్ రీసెర్చ్ విద్యా రంగంలో సంబంధించిన డేటా క్రమబద్ధమైన సేకరణ, విశ్లేషణ సూచిస్తుంది. రీసెర్చ్‌లో వివిధ పద్ధతులు ఉండొచ్చు. రీసెర్చ్ విద్యార్థుల అభ్యాసం, బోధన పద్ధతులు , ఉపాధ్యాయ శిక్షణ. తరగతి గది డైనమిక్స్ వంటి విద్యకు సంబంధించిన వివిధ అంశాలు ఉంటాయి.

విద్యా పరిశోధన లక్షణాల గురించి క్షుణ్ణంగా చదవాల్సివుంటుంది.

విద్యా పరిశోధన స్వభావం పరిశోధన స్వభావంతో సమానంగా ఉంటుంది. విద్యా పరిశోధన ప్రక్రియ సమస్యలను, జ్ఞానాన్ని పరిశోధించడానికి సమాచారాన్ని సేకరించాల్సివుంటుంది. మానవ శాస్త్రం, సామాజిక శాస్త్రం, ప్రవర్తన, చరిత్ర వంటి పలు విభాగాలను కూడా కలిగి ఉంటుంది. అదనంగా, జ్ఞాన అభివృద్ధి, ఆచరణాత్మక మెరుగుదల, విధాన సమాచారం తోడ్పడటం వలన విద్యా పరిశోధన చాలా ముఖ్యమైనది.

విద్యా పరిశోధన పరిధి, శాఖలు, విషయాలు గురించి కూడా అవగాహన అవసరం.

ఎపి ఆర్‌సెట్ 2024-25 నోటిఫికేషన్ వివరాలు

నోటిఫికేషన్ ఇచ్చిన తేదీ అక్టోబర్ 6
దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం అక్టోబర్ 7 నుంచి
ముగింపు తేదీ అక్టోబర్ 21
ఆన్‌లైన్‌లో ఆలస్యంగా రూ.2000 ఫీజుతో అక్టోబర్ 22 నుంచి
ముగింపు తేదీ అక్టోబర్ 25
దరఖాస్తులో తప్పుల సవరణకు అక్టోబర్ 22 నుంచి అక్టోబర్ 26 వరకూ అవకాశం
హాల్‌టిక్కెట్లు వెబ్‌సైట్ ద్వారా అక్టోబర్ 27 నుంచి అక్టోబర్ 31 వరకూ
పరీక్షలు జరిగే తేదీలు : నవంబర్ 3 నుంచి 7వ తేదీ వరకూ
పరీక్షా సమయం : ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ
సాయంత్రం 2 గంటల నుంచి 5 గంటల వరకూ
ప్రిలిమినరీ కీ విడుదల నవంబర్ 10



ఇంటర్వ్యూ కూడా కీలకమే

ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని యూనివర్శిటీల పరిధిలోని పిహెచ్‌డి చేయటానికి ఫుల్‌టైమ్, పార్ట్‌టైమ్ చేయటానికి ఈ ఆర్‌సెట్ ద్వారానే అవకాశం ఉంటుంది. పీజీలో చదివిన సబ్జెక్టును మాత్రమే రీసెర్చ్‌కు ఎంపిక చేసుకోవాలి. ఫుల్‌టైమ్, పార్ట్‌టైం పద్ధతుల్లో ప్రవేశాలు జరుగుతాయి.


ఫుల్‌టైమ్ : రోజూ కళాశాల, యూనివర్శిటీకి వచ్చి నేర్చుకునే అభ్యర్థులు. ఎంపిక చేసుకున్న సబ్జెక్టుల నుంచి థీసిస్ చేసి పిహెచ్‌డి పూర్తిచేయొచ్చు.

పార్ట్ టైమ్ : ఏదైనా ఉద్యోగం, ఉపాధి చేసుకుంటూ ఉన్న వారు పార్ట్‌టైమ్ పద్ధతుల్లో పిహెచ్‌డి చేసుకోవచ్చు. ఉద్యోగం చేసేవారైతే సర్వీసు వివరాలు, నో అబ్జక్షన్ సర్టిఫికెట్లు సమర్పించాలి.

కంప్యూటర్ బేస్డ్ టెస్ట్

ఆర్‌సెట్ పరీక్ష కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సిబిటి) పద్ధతుల్లో జరుగుతుంది. నవంబర్ 3 నుంచి 7వ తేదీ వరకూ పరీక్ష జరుగుతుంది. మొత్తంగా పరీక్ష 200 మార్కులు. సెక్షన్ 1లో పేపర్ 1-70 మార్కులు (రీసెర్చ్ మెథడాలజీ), సెక్షన్ 2లో పేపర్ 2-70 మార్కులకు ఉంటుంది. ఎంపిక చేసుకున్న సబ్జెక్టు నుంచి ఈ ప్రశ్నలు ఉంటాయి. యుజిసి నెట్, జెఆర్ఎఫ్ పరీక్ష లాగానే మల్టీపుల్ ఛాయిస్‌లో ప్రశ్నలు ఉంటాయి. నాలుగు ఛాయిస్‌లో జవాబును గుర్తించాల్సివుంటుంది. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు. నెగెటివ్ మార్కులు లేనందున అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయొచ్చు. రిజర్వేషన్‌కు అనుగుణంగా నోటిఫికేషన్‌లో ఇచ్చిన మార్కుల ఆధారంగా ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణతా ఫలితాలు ఉంటాయి. ఆయా రిజర్వేషన్‌కు అనుగుణంగా నిర్ణీత క్వాలిఫైయింగ్ మార్కులు సాధించిన వారినే ఇంటర్వ్యూకు పిలుస్తారు. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారిని ఇంటర్వ్యూకు పిలుస్తారు. మొత్తం 60 మార్కులకు ఇంటర్వ్యూ ఉంటుంది. ఇందులో కూడా రాణించాల్సివుంటుంది. పేపర్ 1, పేపర్ 2లో వచ్చిన విడివిడిగా చూస్తారు. రెండు పేపర్లలో కూడా ఉత్తీర్ణత సాధించాల్సివుంటుంది.

రీసెర్చ్ మెథడాలజీనే కీలకం (ఆర్ 24-00)



పరిశోధకుడిగా ఎంపికయ్యే అభ్యర్థిలో బోధనా సామర్థ్యం ఉందా? లేదా? అనేది అంచనా వేసే ప్రశ్నలు ఎక్కువగా ఉంటాయి. బోధనా అభ్యసన లక్ష్యాలు, బోధనా సామర్థ్యం, భావ వ్యక్తీకరణ, సబ్జెక్టు అంశాలపై పట్టు, సబ్జెక్టు అంశాలపై పట్టు, విశ్లేషణా సామర్థ్యాలు, ఎవాల్యుయేషన్, అండర్‌స్టాండింగ్ ఆఫ్ స్ట్రక్చర్ ఆర్గ్యుమెంట్స్, తర్కబద్ధ వైఖరి వంటి అంశాలపై అవగాహన ఉంటుంది. సాధారణ అంశాలతోపాటుగా బోధనాభ్యసన విషయాల గురించి ఉన్నత విద్యలోని విషయాలపై ప్రశ్నలు వస్తాయి. సమాజం, మానవ జీవితం, పర్యావరణం, ప్రకృతి వనరులు, వనరులు తగ్గిపోతుండటం వల్ల మానవ జీవితంపై పడుతున్న ప్రభావంపై అవగాహన అవసరం.

సిలబస్ అంశాలు

యూనిట్ -1 టీచింగ్ ఆప్టిట్యూడ్

టీచింగ్ : కాన్సెప్ట్, ఆబ్జెక్టివ్స్, లెవల్స్ ఆఫ్ టీచింగ్ (మెమరీ, అండర్‌స్టాండింగ్, రిఫ్లక్టివ్), క్యారక్టరిస్టిక్స్, బేసిక్ రిక్వైర్‌మెంట్స్

లెర్నర్స్ క్యారెక్టరిస్టిక్స్ : కారక్టరిస్టిక్స్ ఆఫ్ అడాలసెన్స్, అడల్ట్ లెర్నర్స్ (అకడమిక్, సోషల్, ఎమోషనల్, కాగ్నిటివ్). ఇండివిడ్యువల్ డిఫరెన్సెస్.

బోధన ప్రభావిత అంశాలు : టీచర్, లెర్నర్, సపోర్ట్ మెటీరియల్, ఇనిస్టిట్యూషనల్ ఫెసిలిటీస్, లెర్నింగ్ ఎన్విరాన్‌మెంట్, ఇన్‌స్టిట్యూషన్.

ఉన్నత విద్య బోధనలో వ్యవస్థాగత బోధనలు : టీచర్, విద్యార్థి కేంద్రంగా బోధనలు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ బోధనా పద్ధతులు (స్వయం, స్వయంప్రభ, ఎంఒఒసి వంటివి)

బోధనకు ఉపయోగపడే పద్ధతులు : ట్రెడిషనల్, మోడరన్, ఐసిటి బేస్డ్ ఎవాల్యుయేషన్ సిస్టమ్స్. ఎలిమెంట్స్, టైప్స్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఇన్ సూజ్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్. కంప్యూటర్ బేస్డ్ టెస్టింగ్, ఇన్నోవేషన్ ఎవాల్యుయేషన్ సిస్టమ్స్.

యూనిట్ 2 రీసెర్చ్ ఆప్టిట్యూడ్ :

రీసెర్చ్ : రీసెర్చ్ అంటే ఏమిటి?, ఎన్ని రకాలు, క్యారక్టరిస్టిక్స్, పాజిటివిజమ్, పోస్ట్ పాజిటివిస్టిక్ అప్రోచ్ రీసెర్చ్

మెథడ్స్ ఆఫ్ రీసెర్చ్ : ఎక్స్‌పరిమెంటల్, డిస్క్రిప్టివ్, హిస్టారికల్, క్వాలిటేటివఖ్ అండ్ క్వాంటిటేటివ్ మెథడ్స్. స్టెప్స్ ఆఫ్ రీసెర్చ్.

థీసిస్ అండ్ ఆర్టికల్ రైటింగ్ : ఫార్మాట్ అండ్ స్టైయిల్స్ ఆఫ్ రిఫరెన్సింగ్. అప్లికేషన్ ఆఫ్ ఐసిటి. రీసెర్చ్ ఎథిక్స్.

యూనిట్ 3 : కాంప్రెహెన్షన్ : పేరాగ్రాఫ్ ఇస్తారు. అందులో నుంచి ప్రశ్నలు ఇస్తారు. జవాబులు గుర్తించటం.

యూనిట్ 4 : కమ్యూనికేషన్ : కమ్యూనికేషన్ అంటే ఏమిటి?

ఎన్ని రకాల కమ్యూనికేషన్ వ్యవస్థలు ఉన్నాయి.

ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ : వెర్బల్ అండ్ నాన్ వెర్బల్, ఇంటర్ కల్చరల్ అండ్ గ్రూప్ కమ్యూనికేషన్స్. క్లాస్‌రూమ్ కమ్యూనికేషన్స్. బ్యారియర్స్ టు ఎఫెక్టివ్ కమ్యూనికేషన్. మాస్ మీడియా అండ్ సొసైటీ.

యూనిట్ 5 : మేథమెటికల్ రీజనింగ్ అండ్ ఆప్టిట్యూడ్ :

టైప్స్ ఆఫ్ రీజనింగ్, నంబర్ సిరీస్, లెటర్ సిరీస్, కోడ్స్, రిలేషన్‌షిప్స్, మేథమెటికల్ ఆపిట్యూడ్ (ఫ్రాక్చర్, టైమ్ అండ్ డిస్టెన్స్, రేషియో, ప్రొపోర్షన్, పర్సంటేజ్, ప్రాఫిట్, లాస్, ఇంట్రెస్ట్, డిస్కౌంటింగ్, యావరేజెస్ వంటివి.


యూనిట్ 6 : లాజికల్ రీజనింగ్ : అండర్‌స్టాండింగ్ ఆఫ్ ఆర్గ్యుమెంట్స్. ఆర్గ్యుమెంట్స్ ఫోరమ్స్ ఆఫ్ కేటగిరాజిల్ ప్రపోజిషన్స్, మూడ్ అండ్ పిగుర్, ఫార్మల్, ఇన్ఫార్మల్ ఫెసిలిటీస్. ఇవాల్యుయేటింగ్ అండ్ డిస్టింగ్విషింగ్ డిడెక్టివ్, ఇండక్టివ్ రీజనింగ్. ఎనలోజిస్.

వెన్ డయాగ్రమ్ : సింపిల్ అండ్ మల్టిపుల్ యూజ్ ఫర్ ఎస్టాబ్లిషింగ్ వ్యాలిడిటీ ఆర్గ్యుమెంట్స్.

ఇండియన్ లాజిక్ : మీన్స్ ఆఫ్ నాలెడ్జ్.

ప్రమాణాస్ : ప్రత్యక్ష (పర్సెప్షన్). అనుమాన (ఇన్ఫిరెన్స్). ఉపమాన (కంపారిజన్). శద్ద (వెర్బల్ టెస్టిమనీ). అర్తపట్టి (ఇంప్లికేషన్) అనుపాలబ్ధి (నాన్ అప్రెహెన్షన్). స్ట్రక్చర్ అండ్ కైండ్స్ ఆఫ్ అనుమాన (ఇన్ఫెరెన్స్), వృప్తి (ఇన్వారబుల్ రిలేషన్), హెట్వబాసాస్ (ఫెసిలిటీస్ ఆఫ్ ఇన్ఫరెన్స్).

యూనిట్ 7 : డేటా ఇంటర్‌ప్రెటేషన్ : సోర్సెస్, అక్విసిటన్ అండ్ క్లారిఫికేషన్ ఆఫ్ డేటా, క్వాంటిటేటివ్ అండ్ క్వాలిటేటివ్ డేటా. జాగ్రఫికల్ రిప్రజెంటేషన్ (బార్ చాట్, హిస్టోగ్రామ్స్, పైచాట్, టేబుల్ చాట్, లైన్ చాట్) మ్యాపింగ్ డేటా. డేటా ఇంటర్‌ప్రెటేషన్. డేటా అండ్ గవర్నన్స్



"తను చెప్పదలచుకున్న సంగతి తనకే స్పష్టంగా తెలీనప్పుడు, తన చాతగాని తనాన్ని, అర్థ అస్పష్టతనీ ఛందస్సు చీరల వెనకా, అలంకారాల మధ్యా, కఠిన పదాల బురఖాల్లోనూ దాచి మోసగించాలని చూస్తాడు కవి. ముఖ్యంగా సహజ సౌందర్యం తక్కువైనప్పుడు!" - చలం



మరణ వాంగ్మూలం

నిప్పుల చెలగాటంలో
నిర్లక్ష్యపు ప్రయాణం
నివురైపోయిన నిండు జీవితాలు
హాహాకారాలు ఆక్రందనలు
ఆవిరైపోయిన ఆఖరి ఊపిరి
ఉద్విగ్న క్షణాల్లో ఎగసిపడిన
కన్నీటి కెరటాలు
చీకటితల్లి గర్భశోకమై ఆకాశపు గుండెలను తాకిన
మరుక్షణాన
వికలమైన మేఘమాలికల మనసులు
మింటికి మంటికి వానధారలై
విషాదాశ్రువులై విలపించిన తీరు
కనిపించని తీరాలకు
కనుమరుగైపోయిన మనుషులు
తొలి జామున ప్రతిధ్వనించిన మత్యునాదం
పయనమిపుడు మృత్యుద్వారాలు తెరిచింది
ఆత్మీయులో బంధువులో కాదు
నిర్జీవదేహాలు రోదిస్తున్నాయి
దుఃఖప్రవాహం
నెత్తుటిని తడిపేసింది!
(కర్నూలు జిల్లా చిన్న టేకూరు దగ్గర జరిగిన బస్సు ప్రమాదంలో మతులకు నివాళిగా)

– ఆకెపోగు నాగరాజు, 99484 02398

అద్దం లాంటి హృదయం నిండా

నేను
చాలీచాలని జీతపు రాళ్ళ
స్వాతి చినుకుల్ని
గడుస్తోన్న రోజుల్తో గణిస్తూ
చేస్తోన్న ఖర్చుల్లో
చెయ్యాల్సిన అప్పుల కోసం
తిప్పలు పడుతున్నవాణ్ణి!

కుప్పలు తెప్పలుగా భుజాల మీద
వాలుతున్న వినియోగ వస్తువుల
సీతాకోకచిలుకల్ని చూసి వివశుణ్ణై
ఏ చిలుకని సొంతం చేసుకుంటే
ఏ ఉపాంత ప్రయోజనం ఎక్కువ దక్కుతుందో
నా ఎకనామిక్స్ బ్రెయిన్ మొత్తం
ఉపయోగించినా ఏమాత్రం అంతు చిక్కక
వేడెక్కిన బుర్రను చల్లాచ్చుకుందుకు
రోడ్డు పక్కన కాఫీ పార్లర్లో మరుగుతున్న
ధరల్ని తాపీగా తాగుతున్నవాణ్ణి!

పొద్దున్నే లేచి కొళాయి నీళ్ల
పట్టుకునే దగ్గర్నుంచి
రాత్రి భార్యాపిల్లలు అందించిన
అర్జీలను మెదడు మంచమ్మీద
నిద్రపుచ్చే వరకూ
ఎదుగూ బొదుగూ లేని
ఏడ్పుగొట్టు జీవితంతో
ఎడతెగని యుద్ధం చేస్తున్నవాణ్ణి!

బతుకు నిండా
పరుచుకున్న నిజాలు
నెగళ్ళలా సెగలు పెడుతున్నా
బయటి నాగరికతకు భయపడి
వస్తున్న కన్నీళ్లను ఆపుకుంటూ
విలువల వ్యాపారంలో తూనికరాళ్ళలా
మారుతున్న మనుషుల మధ్య
అందమైన అబద్ధాల్లో
ఆత్మవంచన చేసుకుంటోన్నవాణ్ణి!

నా కాలికింద నేల గుంజుకుంటున్నా
నా కళ్ళుమూసి ఒళ్ళు గుల్లజేస్తున్నా
నా గాలినీ నా నీటినీ
నా సహజ వనరులన్నింటినీ
నిర్హేతుకంగా కొల్లగొడుతూ నన్ను
కాలుష్యం కోరల్లోకి నెట్టేస్తున్నా
పిడికిళ్లు బిగించలేని మానసిక
పక్షవాతం సోకిన రోగగ్రస్తుణ్ణి!

నా పైవాణ్ణి చూసి కుళ్లుకుంటూ
నా కిందివాడిపై పళ్ళు కొరుకుతూ
పురాతన భావజాల పైత్యాన్ని
గుండెల నుండా దట్టించుకొని
దిక్కుమాలిన ఈ దరిద్రగొట్టు బతుకులకి
అసలు కారణం తెలిసి కూడా
అద్దం లాంటి హృదయం నిండా
అర్థంలేని మరకల్ని
అంటించుకుంటోన్నవాణ్ణి!

– పతివాడ నాస్తిక్. 9441724167

సృజన - సౌందర్యం

సృజనకారుడిది ఒక అద్భుత దృష్టి
రాతిలో రూపం చూసే దివ్య మనసు
గాలిలో గీతం విన్నవాడు
నిశ్శబ్దంలో నాదం కనుగొన్నవాడు

వెలుగులో వర్ణం వెతుకుతాడు
చీకటిలో చైతన్యం పొదుగుతాడు
కాగితంపై కలల నక్షత్రాలు చిమ్మి
మనసుల ఆకాశం వెలిగిస్తాడు

సౌందర్యం అంటే అతనికి రూపం కాదు
అది రక్తం మరిగే భావం
నొప్పినీ, నవ్వునీ, నిశ్శబ్దాన్నీ
అతడు శిల్పంలా చెక్కుతాడు.

గాలికి రాగం ఇస్తాడు
నీటికి నాట్యం నేర్పుతాడు
వేదనను వచనమై మలచి
జీవితానికి జ్యోతి అవుతాడు

ప్రపంచం దాటే సృజనకారుడు
స్వప్నాల రేఖలతో విశ్వాన్ని మలుస్తాడు
అతని ఆరాధన సౌందర్యమే కాదు
ఆ సౌందర్యం వెనుక దాగిన సత్యం కూడా.

సృజన అంటే అతనికి కళ కాదు
అది అతని శ్వాస.
సౌందర్యం అంటే అలంకారం కాదు,
అది అతని ఆత్మ!

– డాక్టర్ పెరుగు రామకృష్ణ
98492 30443

పాఠకుల గుండెల్లో మోగిన సారంగి

"ఇక్కడ ఏ కొమ్మ వంచి ఏ ఆకును అడిగినా
కథలు కథలుగా చెప్పను వీరుల త్యాగాలు
ఈ నేల అణువణువున ఎక్కడ చెవి ఆన్చినా
వినిపించును అమరుల నెత్తుటి ధారల హెూరు
ప్రతి ఉదయం ఈ పుడమిని రాలే పూలు
గత స్మృతులుగా జారే రక్తాశ్రువులు..."


కవి గానం చేసినట్టు గడచిపోయిన గత వైభవ దీప్తుల జ్ఞాపకాలలోంచి, కాయలుగాచిన ఈ నేల గాయాలను తడుముకుంటూ ఒక గ్రామం నేపథ్యంలో ఆ గ్రామం సాధించిన విజయాలనూ, వైఫల్యాలనూ ఉత్థాన పతనాలను నిస్సంకోచంగా, నిర్మోహంగా, నిర్మోహమాటంగా.. ఆయా అనుభవాలకు అక్షరరూపం ఇచ్చి పాఠకుల్ని ఉద్వేగానికి లోనుగావించి ఉత్కంఠభరితంగా చదివింపజేసిన సమీప గత చారిత్రక వాస్తవ నవల 'తూరుపు కొండల్లో మెరిసిన మేరంగి'. రచయిత రౌతు వాసుదేవరావు.

ఈ నవలలో ఒకనాటి శ్రీకాకుళం జిల్లాలోను, ఆ తరువాత విజయనగరం జిల్లాలోను, ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లాలో ఒక గ్రామం పెద మేరంగి. ఆ గ్రామంలో నాలుగు దశాబ్దాల్లో వచ్చిన మార్పుల చిత్రణ ప్రధాన వస్తువు. స్వాతంత్ర్యోద్యమ కాలం తరువాత కళింగాంధ్ర నేల మీద జరిగిన ఒక ఉత్తేజకరమైన, చైతన్యవంతమైన ఒకానొక ఉద్యమంలో కీలక భూమికలు పోషించిన నాయకులు, ఉద్యమ నేతలతో, వారి పాటలతో, ప్రసంగాలలతో స్ఫూర్తి పొందిన ఊరు, ఆ ఊరి జనంలో రౌతు అప్పల్నాయుడు మాష్టారి పట్ల గల విశ్వాసం, అతనితో ఊరు సాంస్కృతికంగా కళారంగంలో తనదైన ముద్రవేసుకుని ప్రజా చైతన్యానికి బాటలు వేయాలని కళాప్రదర్శనలతో ఎదిగిన తీరు ఉన్నదున్నట్లుగా చెప్పే పద్ధతి వల్ల చదివే పాఠకుడిలో ఉత్సుకత కలుగుతుంది.

అధ్యయనశీలి, అభ్యుదయ భావాలు గల చైతన్యవంతుడైన ఉపాధ్యాయుడున్న చోట తన భావజాలంతో ఆ బడినే కాదు, ఆ పరిసర ప్రాంతాల్నీ ప్రభావితం చేయగలడని రౌతు అప్పల్నాయుడు మాష్టారొక గొప్ప ఉదాహరణ. సాధారణ కాలక్షేపం రచనలు చేసే భూషణం మాష్టారు అప్పల్నాయుడు మాష్టారితో గల దగ్గరితనం కారణంగానే 'కొండగాలి', 'అడివంటు కుంది' వంటి విప్లవ సాహిత్యాన్ని సృష్టించగలిగేరని, 'ఆగాగు నేస్తం.. అందాక వస్తాం' అని 'పాణిగ్రాహి' పాట రాస్తే 'వెళ్ళేవాడిని ఆగమనడమెందుకు, 'ఎందాక నేస్తం.. అందాక వస్తాం' అని మార్చమని సూచించింది అప్పల్నాయుడు మాష్టారే అని చదివినప్పుడు ఆయన సామాజిక అవగాహన, అభ్యుదయ దృక్పథం ఎంత ఉన్నతమో అర్థమవుతుంది.

ఎ.పి.టీచర్స్ ఫెడరేషన్‌లో అప్పల్నాయుడు మాష్టారి పాత్ర, అతనితో పాటు భూషణం, పాల్తేరు ప్రకాశరావు, ఎ.వి.చయనులు, చిలకలపల్లి సీతారాస్వామి వంటి ఉపాధ్యాయులు సంస్థను ఎంత క్రమశిక్షణతో నడిపేరో, ఆనాటి వారి అంకిత భావం ఇప్పటి ఉపాధ్యాయుల్లో ఉందా అనే సందేహం కలుగుతుంది. కమ్యూనిష్టని ప్రభుత్వం పగబట్టి నెలలు తిరక్కుండానే బదిలీలు చేసినా వెళ్ళిన చోటల్లా తోటి ఉపాధ్యాయుల్లో తన భావజాలంతో ప్రభావితం చేయడం మాష్టారికి ఉద్యోగం పట్ల, పార్టీ పట్ల గల నిబద్ధతకు నిదర్శనం.

ఇక ప్రజాకళాకారుడుగా 'మేరంగి'ని సాంస్కృతిక కేంద్రంగా రూపొందించడం, కొడాలి రచన 'లంకెలబిందెలు' నాటకం, పినిశెట్టి రాసిన 'అన్న చెల్లెలు' నాటకం, గంగిశెట్టి రచించిన 'నాంది' నాటకం ఒక సంచలనం. కళారంగానికే కాక, కమ్యూనిస్టు భావజాలానికీ వారసుడని వాసుదేవ



రావు పాత్ర రంగ ప్రవేశంతో నవల మరింత ఊపందుకుంది. మేరంగిలోను, పరిసర గ్రామాల్లోను వెల్లివిరిసిన చైతన్యపు వెల్లువను యథాతథంగా రికార్డు చేసేడు రచయిత. ఎదురైన చేదు అనుభవాలను, సాధించిన విజయాలను సమానంగా చిత్రించడం చూస్తాం.

హైదరాబాద్ నుంచి వచ్చిన జననాట్య మండలి భూపాల్, నిర్మల, మరికొంతమంది వాసు, గంటి ప్రసాదంల సారథ్యంలో సాగించిన సాంస్కృతిక కళా ప్రదర్శనలు, వాటికి గల ప్రజాదరణ, ప్రదర్శనలు జరగకుండా అడుగడుగునా పోలీసులు చేసే ఆటంకాలు, నిర్బంధాలు, ప్రజాకళల గొప్పతనాన్ని తెలియజేస్తాయి. అదే సమయంలో కళాకారుల తెగింపు, సమాజం కోసం ఏదో చేస్తున్నామన్న స్పృహ వారి నిబద్ధతకు నిదర్శనాలుగా నిలుస్తాయి. మామిడి అప్పలసూరి స్వగ్రామం కోమర్తిలో ప్రదర్శన జరక్కుండా పోలీసుల ప్రయత్నం, పోలీసులపై ప్రజల తిరుగుబాటు, దానికి పోలీసుల ప్రతిదాడి, కళాకారులను హింసకు గురిచేసిన సంఘటనలు, కళాకారులపై కేసులు, పార్వతీపురంలో కళాకారుల జైలు నిర్బంధం, ప్రజలందించే సహకారం చదువుతుంటే వొళ్ళు గగుర్పొడుస్తాది.

శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటంలో అమరులు రెడ్డి చిన్నంనాయుడు, మండల సంగమేశులు మేరంగి వాసులే. మరడాన సత్యనారాయణ, వాసుదేవరావు జైలు జీవితం అనుభవించేరు. శారీరక మానసిక చిత్ర హింసలనుభవించిన కళాకారులు మేరంగి యువకులే. కమ్యూనిస్టు గ్రామాలుగా పెదమేరంగి, నారాయణపురం, బొడ్డపాడు, ఆయా గ్రామాల మనుషులు, విప్లవ సానుభూతిపరులు, అప్పటి అభ్యుదయ కళా ప్రదర్శనలతో గ్రామాల్లో వెల్లివిరిసే చైతన్యం, పాఠకుల కళ్ళముందు కదలాడి ఇంత చరిత్ర మన ముందే కదిలెళ్ళిపోయిందా? అని ఆశ్చర్యపోతాం.

వాసుదేవరావు యు.జికి వెళ్ళాలనే తలంపు, అప్పటికే మహానాయకులని కోల్పోయిన పార్టీ స్థితి, అయినా ధృఢనిశ్చయంతో అందుకు సిద్ధం కావడం, తండ్రి వ్యతిరేకత.. తన నిర్ణయం మారిపోవడం, అప్పలసూరి సలహా, చివరికి పార్టీ కార్యక్రమాలు నిర్వహణలో కొనసాగాలనుకోవడం, న్యాయస్థానంలో తీర్పు వ్యతిరేకంగా వస్తే జంటగానే వెళ్ళాలని .. జననాట్య మండలి కళాకారిణి భానుమతి, వాసుదేవరావు దండలు మార్చుకోవడం .. ఎన్నెన్నో వాస్తవ సంఘటనలతో చాలా ఆసక్తికరంగా సాగుతుంది నవల. వంగపండు భూబాగోతం ప్రదర్శనలు, ఆ ప్రదర్శనలతో వచ్చిన గుర్తింపు గౌరవాలు, ఎదురైన అవమానాలు, అదొక పుస్తకం రాయాల్సినంత. చివరిదాకా ఉత్కంఠభరితంగా సాగిన నవల అప్పలనాయుడు మాష్టారి మరణంతో ముగుస్తుంది.

అప్పల్నాయుడు ఏ స్ఫూర్తినైతే అందించాడో అదే చైతన్యంతో కళారంగానికి అంకితమైన వాసు రచయితగా ఈ నవలారచనతో తను పుట్టిన ఊరిని సాహిత్య చరిత్రలో శాశ్వతత్వాన్నిచ్చి రుణవిముక్తుడయ్యేడు. కాల్పనిక సాహిత్యం రాయడంలో వొక వెసులుబాటు ఉంటుంది కానీ వాస్తవ చరిత్ర రచన కత్తిమీద సాము. కానీ, తనదైన శైలిలో రచయిత వాసుదేవరావు చాలా సునాయాసంగా నవలా రచన నిర్వహించేడు. ఎవరి లోపాల్నీ దాచలేదు, ఎవరి బలహీనతల్నీ మరుగు పరచలేదు. ఎదుటి వ్యక్తితో మాట్లాడుతున్నట్లు చాలా సరళంగా, సూటిగా నవల చదువరిని లాక్కుపోతుంది. 'తూరుపు కొండల్లో మేరంగి' చదివితే పాఠకుల గుండెల్లో సారంగి మోగుతుంది. వెనకటి కాలాల్లోకి మనల్ని విసిరేస్తుంది. 'గతకాలమె మేలు వచ్చు కాలము కంటెన్' అనే వేదనతో మనసు కలత పడుతుంది. అట్టాడ అప్పల్నాయుడు రాసిన నవల 'నక్షత్ర బాట', 'మండేటి సూరీడు' మామిడి అప్పల సూరి' ఉద్యమ నేపథ్యంలో వొచ్చిన పుస్తకాలు. అదే ఉద్యమ నేపథ్యంతో 'మేరంగి' కేంద్రంగా సాగిన ఈ నవలల్ని తెలుగు చదవడం వొచ్చిన ప్రతి వొక్కరూ విశేషించి కళింగాంధ్ర యువత చదవాలి. ప్రజాశక్తి ప్రచురించిన ఈ పుస్తకం వెల రు.350. రచయిత ఫోన్ : 94906 78512.

– గంటేడ గౌరునాయుడు
94414 15182

కళింగాంధ్ర కవితాగుచ్ఛం

వేల సంవత్సరాల నాటి కళింగం నేడు ఒరిస్సా, చత్తీస్‌ఘడ్, ఉత్తరాంధ్రగా విడిపోయింది. కళింగ, ఆంధ్ర సంస్కృతుల మేళవింపే కళింగాంధ్ర. అదే ఉత్తరాంధ్ర. ఆంధ్ర కంటే ప్రత్యేకమైన నాగరికత, సంస్కృతీ సంప్రదాయాలు గల నేల అంటూ తన అస్తిత్వాన్ని బైటపెట్టుకోడానికి ఉవ్విళ్ళూరుతున్న నేల కళింగాంధ్ర. కళింగాంధ్ర సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం తొలిమెట్టుగా ఈ ఆరు జిల్లాలకు చెందిన 261 మంది కవుల వివరాలను దుప్పల రవికుమార్ సేకరించారు. వారిలో 72 కవులు రాసిన 130 కవితల్ని 'ముంజూరు' పేరుతో ముద్రించారు. ఇది 2024కు చెందిన కవితావార్షిక. దీనికోసం ఒకొక్క కవీ రెండేసి కవితలు అందించగా, ప్రతి కవితా ఏదో ఒక పత్రికలో అచ్చయినదే కావడం 'ముంజూరు' విశిష్టత.

ఇంతమంది కవుల కవితలున్నా ఇందులో కళింగవేదనను, అస్తిత్వాన్ని కవిత్వీకరించినవారు కొందరే! ప్రకృతి వనరులు పుష్కలంగా ఉండీ, వలసపోతున్న కళింగనేల వేదనను అక్షరీకరిస్తారు కంచరాన నాగధార కవితలో! నాగావళి, వంశధార నదుల మధ్యనగల సారవంతమైన నేలను నాగధారగా గుదిగుచ్చి అభివర్ణించారు వీరు. 'అలల తూలికల్లో నిదురిస్తున్నా, వలస దారుల రద్దు కలగంటూనే ఉంది నాగధార!' అంటూ తాను పుట్టిన నేలను గానం చేస్తారు కంచరాన.

కళింగయుద్ధం నాటినుండీ ఒంటరి అవుతున్న ఆడవాళ్ళు తమకు 'దుక్కీ, దుఃఖమూ తప్పదని, గుండె బలంతోటే బండిని నెట్టుకొని ఎలిపొస్తాము' అనుకొని బతుకుతారట. కంచరాన 'పూరీడు పిట్టపాట' కవితలో కళింగంలోని ఒంటరి మహిళల ధైర్యాన్ని సగర్వంగా చెబుతారు. ఇక్కడి రైతులు కూడా ఎన్ని కష్టాలు వచ్చినా ఎదురొడ్డుతారేగానీ, అప్పు ఎగెయ్యరు. పురుగుల మందు తాగరు. అద్గదీ కళింగనేల పౌరుషం. దయానదిలో రక్తాన్ని పారించిన అశోకుణ్ణి కీర్తించవలసిన దుస్థితి కళింగానికి విరోధాభాస.

బొడ్డ కూర్మారావు రాసిన 'పీనుగ పరుపు' కవిత చదివితే, కిడ్నీ వ్యాధి ఉద్దానంలో ఊళ్ళను పీనుగుల పెంటలుగా ఎలా మారుస్తుందో కదా! అని కళ్ళు స్రవిస్తాయి. 'చలువ పందిళ్ళ కొబ్బరికొమ్మలు, పీనుగ పరుపులౌతున్నాయి! ఊళ్ళో రోగాల ఒరదు అరుస్తూనే ఉంది' అంటూ విలపిస్తారు. ఇదే సమస్యపై 'ఏలినోడు ఏటిసేత్తన్నా' డని నిలదీశారు వినోద్ కుత్తుం. ఉద్దాన ప్రాంతంలో విమానాశ్రయం కడతామని ప్రభుత్వం ప్రకటిస్తే, తమకు అక్కరలేని విమానాల శబ్దాన్ని 'గద్దరెక్కల చప్పుడు'గా కవిత్వీకరించారు వంకల రాజారావు (నిశితాసి).

సువిశాలమైన ఆంధ్రప్రదేశ్ ఉండగా అణుకర్మాగారం, ఫార్మా కంపెనీలు, విష రసాయన పరిశ్రమలు కళింగాంధ్రలో అణువణువునా నిర్మించడం తగదని హెచ్చరిస్తూ గార రంగనాథం 'ఇక్కడే ఇంతటి విధ్వంసం ఎందుకని, ఎదిరించ వీలులేని రాజ్యపు దౌర్జన్యం!' అంటూ 'నిత్య కన్నీటిసంద్ర కళింగాంధ్ర' కవితలో వాపోయారు.

కలమట దాసుబాబు రచించిన 'సాంబడు' కవితలో సాంబడి చూపు 'చురుకైన వాసం మేకు,' సాంబడు 'సేవదేరిన పాసిగున్న', 'బుగతకి జోడెద్దుల పూటు'. 'ముసిరికొన్న వెలిచీకటి సాంబడు' అన్నప్పుడు సాంబడిలో దళితుడ్ని ప్రవేశపెడతారు. ఇలిసిపిల్ల, పురోణి, సొమ్ములోడు కళింగ మాండలికాలు. కనుమరుగైన కంబారి వ్యవస్థను దాసుబాబు ఈ కవితలో చిత్రించగా, కంబారి ఒరియాపదం. కళింగానికే సొంతం. దీని అర్థం పాలేరు. ఇవేకాకుండా ఇక్కడి యాసను, మాండలికపద సంపదనూ అక్షరం చేసి రాసిన కవితలెన్నో ఇందులో ఉన్నాయి.

కళ కళకోసం కాదు, సమాజం కోసమే కవిత్వం రాయాలి అంటూ ప్రాచీన సాహిత్యాన్ని ఎద్దేవా చేసి, పాశ్చాత్య ప్రభావంతో ఆధునిక సాహిత్యం పుట్టుకొచ్చింది. పువ్వులూ, మొగ్గలూ, వసంతం, కొమ్మలో కోయిల గానాలూ నిద్రాణమైన సమాజాన్ని మేల్కొలప లేవని నిశ్చయించి, భావకవిత్వంపై తిరుగుబాటు బావుటా ఎగరేసి, అభ్యుదయ కవిత్వాన్ని తరువాతి కవులు తలకెత్తుకున్నారు. ఉద్యమానికి కవితారసాన్ని పూసి, యువతను ఉత్తూత లూగించాడు శ్రీశ్రీ.

పుస్తకం


అప్పటి సమస్యలు ఇప్పుడు తగ్గాయి. కాని కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయి. జమీందారుల స్థానంలో కార్పొరేట్ జమీందారులు సమాజంపై పట్టు బిగిస్తున్నారు. నోట్లు ఓట్లను ఆకర్షిస్తున్నాయి. మీడియా ప్రజల మనోభావాలను అయినవారివైపు తిప్పుతోంది.

ఇలాంటి సామాజిక రుగ్మతల మధ్య కవులు కవితా ప్రయోగాల బాటపట్టడం శోచనీయం. 'కవులకు సమాజమెందుకు? మంచి కవిత్వం రాసుకుంటాం!' అనే ఒక తెగ బయలుదేరినట్టు తెలుస్తోంది. పద్యాన్ని పశుల కాపర్లు పాడుకొనేవారు తన్మయత్వంతో! నేటి కవిత్వం సమాజానికి అందనంత అయోమయ మార్గంలో పయనిస్తోందన్నది చదువరుల అభిప్రాయం. అటు సౌందర్యమూ లేక, ఇటు సమాజ దౌర్జన్యాలను పట్టి చూపలేకపోతే మరి కవులు సాధించిందేమిటి? ఇలాంటి ప్రశ్నల మధ్య ఈ కళింగ కవులు సామాజిక బాధ్యతతో రాసిన ఎన్నో కవితలు ఇందులో ఉండడం గమనార్హం.

'సమాజం చేసిన ఓ గాయం/ తడారని కన్నీటి గేయం' అంటూ వ్యభిచారి జీవితంలోని వ్యధను కళ్లకు కట్టించారు సిరికి స్వామినాయుడు ఓగు కవితలో! గర్భాన సుమతి 'ఒంటరి నక్షత్రం' కవితలో ఒంటరి మహిళ వేదనను 'నిండు జాబిలిని రాహువు కబళించినట్టు, పసుపు పూసిన పలుపుతాడు మెడలో పడింద'ంటూ ఆత్మాశ్రయంగా రాశారు. ఈమె భావకవిత్వాన్ని చక్కగా పండిస్తారు. శిష్యా మన్నించు! కవితలో "మతోన్మాద దుమ్ములగొండి దేశాన్ని నమిలేస్తుందనే ఎరుకను మీ మెదళ్ళకు ఎక్కించలేక పోయిన దద్దమ్మను" అంటూ శిష్యుడి ముందర గురువు పశ్చాత్తాపడడాన్ని రాస్తారు గార రంగనాథం. సమాజంలో కులమత జాడ్యం పెరిగిపోవడాన్ని నిరసిస్తారు.

"శ్రామికగుర్రాల సకిలింపుల్లో/ అలముకున్న యుద్ధవాతావరణంలో... యుద్ధాన్ని ఆవిష్కరించుకోనివాడు/ గుఱ్ఱాల పరుగుల చప్పుడైనా వినలేడు/ కవన అశ్వాన్ని అధిరోహించలేడు" అంటూ శ్రామిక సమరనినాదం చేస్తారు బొడ్డ కూర్మారావు. కవితపేరూ కవన అశ్వమే! రఫా, బస్తర్ రెండుచోట్లా రెండు కారణాలతో జరుగుతున్న యుద్ధాలను 'నెత్తుటి ఆకాశంలో వెలసిన నెలవంకలు' గా అభివర్ణించారు కెక్యూబ్.వర్మ.

విక్టరీ శంకర్ రాసిన '30 రోజుల వెన్నెల' కవితలో సైనికుడి భార్య 'ద్వారానికి తోరణంగా ఎదురుచూపుల దారంలో ఇమిడిపోయిన నువ్ కట్టిన మంగళసూత్రం" అంటూ అతడికోసం ఎదురు చూస్తుంటుంది. బగాది వెంకటరావు 'సైనికుడి స్వగతం' కవితలో 'నాదేశ సరిహద్దులకు చుట్టిఉన్న



రక్షాతంత్రుల్ని/ నిరంతరం మీటుతున్న సైనికుణ్ణి' అంటూ మరణించిన తరువాత దండేసి, దండంపెట్టడం కాదు, పోరాడ్డానికి అవసరమైన యుద్ధసామగ్రి ఇమ్మని పాలకుల్ని కోరతాడు. సైనికుని అంతరంగ ఆవిష్కరణ బాగుంది. మల్లారెడ్డి మురళీమోహన్‌ది చక్కని వాక్యనిర్మాణం.

'తుపాను రాత్రి సముద్రం తనముందున్నట్టు కల్లోల పడుతుందట. ఒడ్డు కనపడని పడవలా 'పేగుతెగిన తల్లుల దుఃఖంవేరు అంటారు. ఇది 'ఒడువని దుఃఖం' కవితలో కె.వి.కూర్మనాథ్ విషాదచిత్రణ.డి.వి.జి.శంకరరావు అందమైనతోట కవితలో 'సౌందర్యం చాలదా? సమదృష్టి ఏల?' అంటూ పాలకపక్షాలు ధనికుల ఆనందానికే పథకాలు రచిస్తున్నాయి గాని, పేదల సంక్షేమానికి కృషిచేయడం లేదని నర్మగర్భంగా రాశారు. 'స్తబ్దత పొందిన ప్రవచన వాక్యం కాదు/ నిబద్ధత కలిగిన విశ్వశ్రేయః కావ్యం మన సంస్కృతి' అంటూ భారతీయ సంస్కృతి కేతనాన్ని ఆకాశమంత ఎత్తున రెపరెపలాడించారు దీర్ఘాశి విజయభాస్కర్ 'ఏది మన సంస్కృతి' అనే కవితను ముగిస్తూ!

పాలస్తీనా యుద్ధం గూర్చి మానాపురం రాజాచంద్రశేఖర్, సర్వమంగళ 'మాతృత్వపు కమ్మదనం', 'ఋతుగీతం' బండి సత్యనారాయణ, చివుకుల శ్రీలక్ష్మి స్మృతి కవిత, కూరెళ్ళ శ్రేయ 'విన్నపం', స్వర్ణశైలజ 'సంతృప్తి పరిమళం' ఇలా మరికొందరు మరిన్ని మంచి కవితలు రాశారు. ఛందోబద్ధ పద్యాన్ని హృద్యంగా రాయగల నేతేటి గణేశ్వరరావు, బోణం మోహనగాంధీ, రఘుపాత్రుని సాయిశివ, చావలి సాంబశివ సుబ్రహ్మణ్యం, ప్రవాహి తదితర కవుల పద్యాలున్నాయి. 'నిజం', గంటేడ గౌరునాయుడు, కుప్పిలి పద్మ, బాల సుధాకరమౌళి, లండ సాంబమూర్తి, పాయల మురళీకృష్ణ, రాంభక్త పద్మావతి తదితరులు ఎప్పటినుండో చేయి తిరిగిన కళింగ కవులు. వీరి కవితలు ఈ గ్రంథానికి అదనపు శోభ. చూరు అంటే పెడక. పెడక ముందరి భాగం ముంజూరు. కళింగనేల మాండలికం. ముంజూరులో దూరి కళింగాంధ్ర కవితా గానాన్ని వినండి. పుస్తకం కోసం: 99892 65444 సంప్రదించవచ్చు.

– గార రంగనాథం
98857 58123

పిత్త పరిగలగుంట

ఉరుముల మదంగ వాయిద్యాలాగినాక
వాగులు వంకలు పొంగిపొర్లిన వాన
ఒక ప్రశాంత వాతావరణంలో కుదురుకున్నాక
చెరువులు కుంటలు నిండిన జలరాశి
ఉత్పత్తి ప్రక్రియ మొదలెడతుంది
శివరాత్రి బైలెల్లి రథసప్తమి అడుగెట్టినాక
వాగు వంకల్లో మెట్ట పల్లాలు బయల్పడినాక
గుంటల్లో పెరిగే చేపలు రొయ్యలు
పైకీ కిందికీ కోలాటమాడతాయి
సెలవుల్లో చేపలు పట్టడం నా హాబీ కాబట్టి
నా కాళ్ళు ఎప్పుడూ పిత్తపరిగల గుంటలోనే ఆగేవి
తూలి పడబోతూ, నిలదొక్కుకుంటూ, పడుతూ లేస్తూ

పోగు చేసిన చేపలతో ఇంటి బాట పట్టేవాన్ని
ఆ పూట కూరకి తెచ్చిన చేపల్ని చూసి
అమ్మ కళ్ళు ఆనందంతో మెరిసేది
అన్నం ముద్ద నోట్లోకి చేరే సమయాన
నాన్న మొఖం గర్వంతో పొంగి పోయేది
ఆ ఇద్దరి ముఖాల్ని చూసి
నా ముఖంలో ఒకింత ఆనందం
మెరుపులా మెరిసి మాయమయ్యేది

కాలచక్రం పాతికేళ్ల పాటు గిర్రున తిరిగేసరికి
ఓడలు బల్లైనాయి
పట్నంలో ఇరుకు గదిలో ఇరుక్కున్న నేను
చాలా రోజులకి సొంత ఊరికి వెళ్తే ...
స్వాగతం పలకడానికి పిత్త పరిగెల గుంట లేదు
దాన్ని గుర్తుంచుకున్న మనిషి లేడు
ఎవరికి వాళ్లు వాళ్ల చట్రాల్లో ఇరుక్కుని
మౌనయోగులై ఒంటికాలి జపం చేస్తున్నారు
ఆ గుంట మీద బ్రాందీ షాపు నిలబడి ఉంది దర్జాగా
వచ్చిన వాళ్ళందరికీ మద్యాన్ని పంచి పెడుతూ
మళ్లీ మనసు పాతికేళ్ళ ముందుకి పరిగెడుతుంది వేగంగా ...

– ఆవుల వెంకటరమణ, 9494088110

2న విశాఖలో ఆరుద్ర శత జయంతి ముగింపు సభ

నవంబరు 2వ తేదీన విశాఖపట్నంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యాన కవి, రచయిత, పరిశోధకుడు ఆరుద్ర శత జయంతి ముగింపు సభ జరగనుంది. ఉదయం 10 గంటలకు జరిగే ఈ సభలో సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, ప్రముఖ రచయిత అట్టాడ అప్పల నాయుడు, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కెంగార మోహన్, సత్యరంజన్, చీకటి దివాకర్, సత్యాజీ తదితరులు పాల్గొంటారు. ఇదే వేదికపై సాహితీ స్రవంతి విశాఖ కమిటీ ప్రచురించిన 'తిమిరాన్ని తరిమేస్తాం' కవితా సంకలనం ఆవిష్కరణ ఉంటుంది.

– సాహితీ స్రవంతి

సాహితీకిరణం రెండు కథల పోటీలు

సాహితీ కిరణం మాసపత్రిక వివిధ సంస్థల సౌజన్యంతో రెండు కథల పోటీలు ప్రకటించింది.

1. విడదల నీహారికా ఫౌండేషన్ సంక్రాంతి కథలపోటీ – 2026 : ఈ పోటీలో ఐదు ఉత్తమ కథలకు ఒక్కొక్క కథకి రూ.2000 చొప్పున బహుమతులు ఉంటాయి. కథ రాతలో 6 పేజీలకు, డిటిపి అయితే 4 పేజీలకు మించకుండా ఉండాలి.

2. ముట్నూరి కమలమ్మ ఫౌండేషన్ చిన్న కథల పోటీ –2025 : ఈ పోటీలో 6 ఉత్తమ కథలను ఎంపిక చేసి ఒక్కొక్క కథకి రూ.1000 చొప్పున అందిస్తాము. కథ నిడివి రాతలో 4 పేజీలకు, డిటిపి అయితే 2 పేజీలకు మించి ఉండకూడదు. కథలు చేరవలసిన ఆఖరు తేదీ : 30–11–2025. కథలు చేరవలసిన చిరునామా : సాహితీకిరణం, ఇం.నెం.11–13–154, అలకాపురి, రోడ్ నెం.3, హైదరాబాద్–500102. వివరాలకు సంప్రదించవలసిన నెంబర్ : 94907 51681.

స్వర్ణ వాహిని దండేకు సాహిత్య ప్రతిభ పురస్కారం

శ్రీమతి స్వర్ణ వాహిని దండేకి ఈ ఏడాది జూటూరు విజయలక్ష్మి జాతీయ సాహిత్య ప్రతిభ పురస్కారం లభించింది. ఈ అవార్డును నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా సూరేపల్లి రాములమ్మ ఉమెన్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవాడలో అందజేయనున్నారు. విద్యా, సాహిత్య, సామాజిక రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న స్వర్ణ వాహిని పలు ఉన్నత విద్యార్హతలతో పాటు Problems of Adolescents and Solutions పుస్తక రచయితగా కూడా గుర్తింపు పొందారని సూరేపల్లి రాములమ్మ ఉమెన్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు సూరేపల్లి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

రాయలసీమ మహా కవిసమ్మేళనం

రాయలసీమ సాంస్కృతికోద్యమంలో భాగంగా రాయలసీమ సాంస్కృతిక వేదిక, డల్లాస్ ఏరియా రాయలసీమ అసోషియేషన్ ఆధ్వర్యంలో తొమ్మిదవ రాయలసీమ మహా కవిసమ్మేళనం నవంబర్ 30వ తేదీన అనంతపురంలో జరగనుంది. 'రాయలసీమ ప్రసిద్ధ ప్రదేశాలు' అంశం నేపథ్యంగా కవితలు ఉండాలి. కవుల పేర్ల నమోదుకు నవంబర్ 15 చివరి తేది. కవితలను నవంబర్ 25 లోపు పంపాలి. మరిన్ని వివరాలకు 9963917187 సంప్రదించగలరు.

– డా.అప్పిరెడ్డి హరినాథరెడ్డి,
సమన్వయకర్త

మధ్యప్రదేశ్‌లో దళితుడి దారుణ హత్య

భింద్ : మధ్యప్రదేశ్‌లోని భింద్ జిల్లాలో ఒక దళిత వ్యక్తిని పక్కింటి వ్యక్తులు దారుణంగా కొట్టి చంపారు. ఈ సంఘటన భింద్‌కు 65 కిలోమీటర్ల దూరంలో, దబోహ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక గ్రామంలో జరిగింది. ఈ గ్రామంలోని 35 ఏళ్ల దళిత వ్యక్తి రుద్ర ప్రతాప్ సింగ్ జాతవ్‌కు తమ పక్కింట్లో ఉండే కౌరవ్ కుటుంబంతో కొంతకాలంగా వివాదం నడుస్తోంది. శనివారం కౌరవ్ కుటుంబానికి చెందిన ఐదుగురు వ్యక్తులు కర్రలతో జాతవ్‌పై దాడి చేశారు. దాడిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన ఒక వృద్ధుడు కూడా గాయాల పాలయ్యాడు. తీవ్రంగా గాయపడిన జాదవ్‌ను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. తరువాత మరింత మెరుగైన వైద్యం కోసం గ్వాలియర్‌కు తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే మరణించాడు. జాతవ్ మరణించిన విషయం తెలియడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. జాతవ్ బంధువులు, కొంతమంది గ్రామస్తులు దాడికి పాల్పడిన వ్యక్తుల్లో ఒకరి ఇంటిని తగలబెట్టారు. ఇంటి బయట ఉన్న కారు, మోటార్ సైకిల్‌ను కూడా దగ్ధం చేశారు. జిల్లా ఎస్‌పి అసిత్ యాదవ్, డిప్యూటీ ఎస్‌పి సంజీవ్ పాఠక్ తమ పోలీసు బలగాలతో అక్కడకు చేరుకున్నారు. సమీపంలోని ఇతర పోలీస్ స్టేషన్ల నుంచి అదనపు బలగాలను రప్పించారు. జాతవ్‌పై దాడికి పాల్పడిన రణవీర్ కౌరవ్, అషు కౌరవ్, ప్రహ్లాద్ కౌరవ్, రాజీవ్ కౌరవ్, కున్వర్ సింగ్ కౌరవ్‌లపై బిఎన్ఎస్ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఎస్‌పి యాదవ్ తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నారని, గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.

దేశవ్యాప్త ఎస్ఐఆర్‌పై నేడు ప్రకటన?

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా నిర్వహించే ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర పరిశీలన (ఎస్ఐఆర్)పై కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) సోమవారం సాయంత్రం ఒక ప్రకటన చేసే అవకాశం ఉంది. న్యూఢిల్లీలో ఇసిఐ విలేకరుల సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. దేశవ్యాప్త ఎస్ఐఆర్ తొలి దశలో 10 నుంచి 15 రాష్ట్రాల్లో అమలు చేసే అవకాశం ఉంది. వీటిలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాలు ప్రధానంగా ఉండనున్నాయి. 2026లో తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ నెల 23, 24 తేదీల్లో దేశరాజధానిలో జరిగిన ప్రధాన ఎన్నికల అధికారులు సమావేశంలో దేశవ్యాప్త ఎస్ఐఆర్ కోసం సన్నద్ధతపై చర్చించారు.

నేడు ఉమర్ ఖలీద్ తదితరుల బెయిల్‌పై సుప్రీం విచారణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సామాజిక కార్యకర్త ఉమర్ ఖలీద్‌తో పాటు మరో ముగ్గురు బెయిల్ పిటిషన్‌ను సుప్రీం కోర్టు సోమవారం విచారించనుంది. 2020 ఫిబ్రవరిలో ఢిల్లీలో జరిగిన అల్లర్ల కేసులో యుఎపిఎ కేసులో ఉమర్ ఖలీద్, షార్జీల్ ఇమామ్, గుల్ఫిషా ఫాతిమా, మీరాన్ హైదర్‌ల బెయిల్ పిటిషన్లను విచారించేందుకు సుప్రీంకోర్టు జాబితా చేసింది. జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్‌వి అంజరియాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లను విచారించనుంది. సెప్టెంబర్ 22న సుప్రీంకోర్టు ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేసి, అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. సెప్టెంబర్ 2న ఢిల్లీ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సామాజిక కార్యకర్తలు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ప్రదర్శనలు, నిరసనల ముసుగులో కుట్ర పూరిత హింసను అనుమతించలేమంటూ ఉమర్ ఖలీద్, ఇమామ్‌లతో పాటు ఫాతిమా, హైదర్, మొహమ్మద్ సలీమ్ ఖాన్, షిఫా ఉర్ రెహ్మాన్, అథర్ ఖాన్, అబ్దుల్ ఖలీద్ సైఫీ, షాదాబ్ అహ్మద్‌కు బెయిల్‌ను హైకోర్టు తిరస్కరించింది. మరో నిందితుడు తస్లీం అహ్మద్ బెయిల్ పిటిషన్‌ను సెప్టెంబర్ 2న వేరే హైకోర్టు ధర్మాసనం తిరస్కరించింది. నిందితులు 2020 నుండి జైలులో ఉన్నారు.

జిఎస్‌టి మార్పులతో అన్ని వర్గాల్లో సంతోషం

- మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దసరా, దీపావళి పండుగల వేళ జిఎస్‌టి శ్లాబులలో తీసుకొచ్చిన మార్పులు అన్ని వర్గాల్లో సంతోషాన్ని నింపాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ఆదివారం మన్‌కీ బాత్ 127వ ఎపిసోడ్‌లో ఆయన మాట్లాడారు. జిఎస్‌టి మార్పుల వల్ల ఈ సీజన్లో దేశీయ వస్తువుల కొనుగోళ్లు గణనీయంగా పెరిగాయన్నారు. వంట నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించాలని రాసిన లేఖకు సానుకూల స్పందన వచ్చిందని అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని అంబికాపుర్‌లో గార్బేజ్ కేఫ్ వినూత్నంగా పర్యావరణానికి సేవలు అందిస్తోందని తెలిపారు. అక్కడ కిలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఇచ్చి ఫుల్ మీల్స్ తినొచ్చని, అరకిలో ఇస్తే అల్పాహారం ఇస్తారని చెప్పారు. ఈ కేఫ్‌ను అంబికాపూర్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహిస్తోందని అభినందించారు. పలు రాష్ట్రాల్లో జరుపుకుంటున్న ఛాత్‌పూజ గురించి, మావోయిస్టుల గురించి ప్రధాని ప్రస్తావించారు.

కొల్‌కతా, గ్వాంగ్‌జౌ మధ్య విమాన సర్వీసులు ప్రారంభం

కొల్‌కతా : దాదాపు నాలుగేళ్ల విరామం తరువాత భారత్‌లోని కొల్‌కతా నుంచి చైనాలోని గ్వాంగ్‌జౌకు నేరుగా విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. మొదటి సర్వీసు ఆదివారం రాత్రి 10 గంటలకు కొల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గ్వాంగ్‌జౌకు బయలుదేరి వెళ్లింది. గతంలో ఈ రెండు నగరాల మధ్య నేరుగా విమానాలు నడిచేవి. ఇరుదేశాల మధ్య సరిహద్దు వివాదం ప్రారంభమైన తరువాత ఈ సర్వీసులను నిలిపివేశారు. ఇటీవల మళ్లీ భారత్ - చైనా మధ్య దౌత్య సంబంధాలు పూర్వస్థితికి చేరుకుంటుండటంతో ఈ నగరాల మధ్య రోజువారీ, నాన్-స్టాప్ విమాన సర్వీసులను ఇండిగో ప్రారంభించింది.

అధికారంలోకి వస్తే చెత్తబుట్టలో వక్ఫ్ చట్టం

- మతతత్వశక్తులకు నితీష్ కుమార్ మద్దతు
- తేజస్వి యాదవ్



సభలో మాట్లాడుతున్న తేజస్వియాదవ్

పాట్నా : బీహార్‌లో ఇండియా బ్లాక్ అధికారంలోకి వస్తే వక్ఫ్ సవరణ చట్టాన్ని చెత్త బుట్టలో పడేస్తామని సిఎం అభ్యర్థి తేజస్వియాదవ్ అన్నారు. ఆదివారం కతిహార్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తన తండ్రి, ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ దేశంలోని మతతత్వ శక్తులతో ఎప్పుడూ రాజీపడలేదని అన్నారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఎల్లప్పుడూ అలాంటి శక్తులకు మద్దతు ఇస్తున్నారని విమర్శించారు. ఆయన కారణంగానే ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంఘాలు రాష్ట్రంలోనూ, దేశంలోనూ మత విద్వేషాన్ని వ్యాపింపజేస్తున్నాయని అన్నారు. 20 ఏళ్ల నితీశ్ కుమార్ ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి తెలివి లేదని, ప్రభుత్వంలోని ప్రతి విభాగంలోనూ అవినీతి విపరీతంగా పెరిగిపోయిందని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా కుప్పకూలిపోయాయన్నారు. సీమాంచల్ ప్రాంత అభివృద్ధికి ఎన్‌డిఎ ప్రభుత్వం ఏమీ చేయలేదని విమర్శించారు. అధికారంలోకి వస్తే, ఈ ప్రాంతం సమగ్ర అభివృద్ధి కోసం సీమాంచల్ అభివృద్ధి అథారిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తన ఎన్నికల వాగ్దానాలను ఎన్‌డిఎ ప్రభుత్వం కాపీ కొడుతోందని అన్నారు. వృద్ధాప్య పింఛను పెంచుతామని తాము హామీ ఇచ్చామని, నితీశ్ సర్కార్ దానిని నెలకు రూ.400 నుంచి రూ.1,100కు పెంచిందని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత నెలకు రూ.2,000కు పెంచుతామని హామీ ఇచ్చారు.

జెడియులో అసమ్మతి కుంపటి

మాజీ మంత్రులతో సహా 16 మందిపై వేటు

బీహార్ సీఎం నితీశ్ కుమార్ నేతృత్వంలోని జెడియును రెబల్స్ భయపెడుతున్నారు. సీట్లు దక్కక వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు, పార్టీ నిర్ణయాలను ధిక్కరించినందుకు మాజీ మంత్రులతో సహా 16 మంది నాయకులను బహిష్కరించింది. వారిని పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేసినట్లు జెడియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందన్ కుమార్ సింగ్ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. బహిష్కరణకు గురైన వారిలో మాజీ మంత్రి శైలేష్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు శ్యామ్ బహదూర్ సింగ్, సుదర్శన్ కుమార్, మాజీ ఎమ్మెల్సీలు సంజయ్ ప్రసాద్, రణవిజయ్ సింగ్ ఉన్నారు. పార్టీ అధికారికంగా ప్రకటించిన అభ్యర్థులకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారనీ, తమ సిద్ధాంతాన్ని ఉల్లంఘించిన కారణంగా ఈ చర్యలు తీసుకున్నట్లు జెడి (యు) సీనియర్ నేత ఒకరు చెప్పారు. 243 మంది సభ్యులను కలిగి ఉండే బీహార్ అసెంబ్లీకి వచ్చే నెల 6, 11 తేదీలలో రెండు దశలలో ఎన్నికలు జరగనున్నాయి. అదే నెల 14న తుది ఫలితాలు వెలువడనున్నాయి.



సభలో మాట్లాడుతున్న అశోక్ ధావలే

బీహార్‌లోని విభూతిపూర్, హయాఘాట్ స్థానాల్లో

సిపిఎం ప్రచారం ముమ్మరం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఎం ప్రచారం ముమ్మరం చేసింది. ఆదివారం సమస్తిపూర్ జిల్లా విభూతిపూర్ అసెంబ్లీ స్థానంలోనూ, దర్భంగా జిల్లా హయాఘాట్ అసెంబ్లీ స్థానంలోనూ సిపిఎం భారీ ఎన్నికల బహిరంగ సభలను నిర్వహించింది. ఈ బహిరంగ సభల్లో పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ ధావలే, అభ్యర్థులు ఎమ్మెల్యే అజయ్ కుమార్, శ్యామ్ భారతి ప్రసంగించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నితీష్ కుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం బిజెపి నియంత్రణలో పనిచేస్తోందని విమర్శించారు. అన్ని రంగాల్లోనూ రాష్ట్రాన్ని అధోగతి పాలుచేసిందన్నారు. ఇండియా బ్లాక్ మద్దతుతో పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి లాలన్ చౌదరి, సీనియర్ నేత అవధేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభురాజ్ నారాయణ రావు, సంజయ్ కుమార్, జిల్లా కార్యదర్శులు మంతు ఠాకూర్, మనోజ్ యాదవ్, రామాశ్రయ్ మహతో, ఇతర మహాఘటబంధన్ నాయకులు పాల్గొన్నారు.

ఢిల్లీ విద్యార్థినిపై యాసిడ్ దాడి..

- పరారీలో నిందితులు



ఆసుపత్రిలో బాధిత విద్యార్థిని

న్యూ ఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థినిపై యాసిడ్ దాడి జరిగింది. అశోక్ విహార్‌లోని లక్ష్మి భాయి కళాశాల సమీపంలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితురాలు ఢిల్లీ యూనివర్శిటీ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతుంది. అదనపు తరగతుల కోసం కళాశాలకు వస్తున్న క్రమంలో ఉదయం 10 గంటల సమయంలో ముగ్గురు దుండగులు ఆమె ముఖంపై యాసిడ్‌తో దాడి చేశారు. ఆమె చేతులు అడ్డుపెట్టుకోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. డిప్యూటీ కమిషనర్ భీషం సింగ్ మాట్లాడుతూ ప్రధాన నిందితుడు ముకుంద్‌పూర్ నివాసి జితేందర్‌గా గుర్తించామన్నారు. అతనితో పాటు ఇషాన్, అర్మాన్‌లు ఉన్నారని, బాధితురాలు కూడా అక్కడే నివసిస్తుందని తెలిపారు. బైక్‌పై వచ్చిన ముగ్గురు తనను అడ్డుకున్నారని. అనంతరం యాసిడ్ తన ముఖంపై విసరగా తప్పించుకోవడానికి చేతులు అడ్డుపెట్టుకున్నానని ఆమె వాంగ్మూలం ఇచ్చినట్లు తెలిపారు. దాడి అనంతరం దుండగులు పరారయ్యారు. స్థానికులు ఆమెను దీప్ చంద్ బంధు హాస్పటల్‌కు తరలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సిసి టీవి ఫుటేజీలను పరిశీలించారు. క్రైం బ్రాంచ్, ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలను సేకరించారు. జితేందర్ కొంతకాలంగా బాధితురాలిని వేధిస్తున్నాడని, గత నెలలో ఇరువురికి పెద్ద గొడవలు జరిగాయని, అనంతరం వేదింపులు పెరిగాయని పోలీసులు నిర్ధారించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని, అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులు సంచరిస్తే సమాచారం అందించాలని పోలీసులు స్థానికులను కోరారు...

ట్రంప్ పర్యటనపై జనాగ్రహం

- కౌలాలంపూర్‌లో భారీ నిరసన



కౌలాలంపూర్‌లో ట్రంప్ పర్యటనపై నిరసన తెలుపుతున్న స్థానికులు

కౌలాలంపూర్ : ఆసియాన్ సదస్సుకు హాజరయ్యేందుకు మలేసియా రాజధాని కౌలాలంపూర్ చేరుకున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదివారం నిరసనల స్వాగతాన్ని చవిచూశారు. మధ్యప్రాచ్యంలో అమెరికా మద్దతుతో జరుగుతున్న అణచివేతకు తక్షణమే స్వస్తి చెప్పాలని డిమాండ్ చేస్తూ వేలాదిమంది ప్రదర్శకులు దాతారన్ మర్డెకా సమీపంలో కదం తొక్కారు. వారంతా అమెరికాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, హక్కుల కార్యకర్తలు అధిక సంఖ్యలో భాగస్వాములయ్యారు. ప్రపంచ వ్యవహారాలలో అమెరికా జోక్యాన్ని వారంతా నిరసించారు. నల్లని దుస్తులు ధరించిన ప్రదర్శనకారులు 'అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి', 'పాలస్తీనాకు స్వేచ్ఛ కల్పించాలి', 'ట్రంప్ హంతకుడు' అని రాసివున్న బ్యానర్లు చేతపట్టుకొని ముందుకు నడిచారు. ఇజ్రాయిల్ మారణహోమానికి అమెరికా వత్తాసు పలుకుతున్నందున ఈ ప్రదర్శన చేపట్టామని బాయ్‌కాట్, డైవెస్ట్‌మెంట్ అండ్ శాంక్షన్స్ (బిడిఎస్) మలేసియా సంస్థ ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ మహమ్మద్ నజారీ ఇస్మాయిల్ తెలిపారు. తన భాగస్వామి సాగిస్తున్న అరాచకాలను అమెరికా గుడ్డిగా సమర్థించకుండా ఉండి ఉంటే పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ మారణహోమానికి పాల్పడి ఉండేది కాదని ఆయన చెప్పారు. అమనాహ్ ఇంటర్నేషనల్ బ్యూరో ఛైర్మన్ రాజా కమారుల్ బహరిన్ షా, మాజీ ఎంపీ తియాన్ చువా తదితర ప్రముఖులు ర్యాలీకి హాజరయ్యారు. అంపాంగ్ పార్కులో ప్రదర్శన నిర్వహించాలని తొలుత నిర్వాహకులు భావించినప్పటికీ ఆ ప్రాంతం ఆసియాన్ సదస్సు 'రెడ్ జోన్' పరిధిలో ఉన్నందున దాతారన్ మర్డెకాకు మార్చామని పోలీసులు తెలిపారు. సదస్సు నేపథ్యంలో కౌలాలంపూర్‌లో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు. పది వేల మందికి పైగా అధికారులను నియమించారు. నగరంలోని ప్రధాన రహదారులన్నింటినీ మూసివేశారు.

డేటా సెంటర్‌పై వాస్తవాలు చెప్పండి

(మొదటిపేజి తరువాయి)

మరలా ఒప్పందం చేసుకొని డేటా సెంటర్ కోసం 400 ఎకరాలు కేటాయించిందని, అందులో 130 ఎకరాలను (రుషికొండ -3 చుట్టూ) కోటి రూపాయల చొప్పున రిజిస్టర్ చేసిందని తెలిపారు. ఇప్పుడు ఆ భూములన్నీ ఖాళీగా ఉన్నాయన్నారు. అదాని డేటా సెంటర్ పెట్టలేదని, ఉపాధి కల్పించలేదని తెలిపారు. ఇప్పుడు గూగుల్‌తో జాయింట్ వెంచర్ చేస్తున్నారన్నారు. ఈ స్థితిలో అదానికి కేటాయించిన భూములను గూగుల్ డేటా, ఎఐ హబ్ కోసం కేటాయించాలని, ఆ భూములు ఖాళీగా పెట్టి మరోచోట తిరిగి రైతుల భూములు సేకరించడం సమంజసం కాదని శ్రీనివాసరావు పేర్కొన్నారు. పైగా, అభివృద్ధి పేరుతో ప్రజల మనోభావాలను ముందుకు తెచ్చి నష్టపోతున్న రైతుల నోళ్లు నొక్కడం సరైంది కాదన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఇప్పటివరకు వైజాగ్ ఐటి పార్కు పేరుతో పనోరమ హిల్స్‌పై పది కంపెనీలకుపైగా స్థలాలు కేటాయించారని, ఒక్క కంపెనీ కూడా ప్రారంభం కాలేదని వివరించారు. డేటా సెంటర్ ద్వారా ఐదు వేల నుంచి 6 వేలకు మించి ప్రత్యక్ష ఉద్యోగాలు రావని నిపుణులు చెప్తున్నారన్నారు. విశాఖలో ఒక పెద్ద డేటా సెంటర్‌ను మానిటరింగ్ చేయడానికి, దానికి అనుబంధంగా విద్యుత్, నీరు వగైరాల సరఫరాకు ఎంతమంది ఉద్యోగులు అవసరం అవుతారో గూగుల్‌తో జరిగిన ఒప్పందంలో నిర్దిష్టంగా హామీ ఇచ్చారా? వారు తీసుకునే సిబ్బందిలో ఆంధ్రప్రదేశ్ నుండి ఎంతమందిని తీసుకుంటారో స్పష్టం చేశారా? గత అనుభవాల దృష్ట్యా వివిధ పరిశ్రమల్లో స్థానికులకు చాలా తక్కువ ఉద్యోగాలు లభించాయన్నదే వాస్తవమని పేర్కొన్నారు. ప్రపంచం అంతటా ఐటి ఉద్యోగాల్లో కోత పడుతోందన్న వాస్తవం ముఖ్యమంత్రికి తెలుసునన్నారు. బాధితుల్లో మన రాష్ట్రం వారు కూడా ఉన్నారని చెబుతూ టిసిఎస్ కంపెనీలో తొలగింపులను వి.శ్రీనివాసరావు ఉదహరించారు. ఎఐ ప్రభావంతో గూగుల్, మెటా, మైక్రోసాఫ్ట్ వగైరా ప్రఖ్యాత కంపెనీలు సిబ్బందిని తగ్గిస్తున్నాయని, ఈ స్థితిలో ఎఐ హబ్‌లో ఎంతమందికి ఉద్యోగాలు వస్తాయో ప్రభుత్వం కచ్చితమైన అంచనా వేసిందా? ఉద్యోగ భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అనే అంశాలను వివరించాలని లేఖలో శ్రీనివాసరావు కోరారు. వాస్తవాలతో నిమిత్తంలేని లెక్కలు భవిష్యత్తులో యువతరాన్ని మరింత అసంతృప్తికి గురిచేయవా? అని పేర్కొన్నారు.

ప్రత్యేక హోదా వచ్చి ఉంటే మేలు జరిగేది

రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చి ఉంటే గూగుల్ లాంటి కంపెనీలు అనేకం వాటంతట అవే వచ్చి ఉండేవని వి.శ్రీనివాసరావు అన్నారు. ఈపాటికి విశాఖ సహా రాష్ట్రం మరో అడుగు ముందుకేసి ఉండేదని పేర్కొన్నారు. ఇప్పుడు రూ. 22 వేల కోట్లు ఎదురిచ్చి ఆహ్వానించాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. ఇప్పటికైనా ప్రత్యేక హోదా కోసం పోరాడాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. జిఒ 40లో పేర్కొన్న విధంగా గూగుల్ డేటా సెంటర్‌కు వివిధ రూపాల్లో రూ.22 వేల కోట్లు రాయితీలిస్తున్నారని, ఇప్పటి వరకు ఇంత పెద్ద మొత్తంలో ఏ కంపెనీకీ ఏ ప్రభుత్వమూ ఇవ్వలేదన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఈ రాయితీల ద్వారా రాష్ట్రానికి వస్తున్న లాభం ఎంత? భూములు త్యాగం చేసిన రైతులకు జరుగుతున్న లాభమేంటి? కనీసం ఆ మొత్తానికి సమానంగా ప్రభుత్వ వాటా ఎందుకు తీసుకోలేదు? అని శ్రీనివాసరావు ప్రశ్నించారు. విశాఖలో డేటా సెంటర్ పెడితే ఒక డిగ్రీ ఉష్ణోగ్రత పెరుగుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారన్నారు. ఇప్పటికే పర్యావరణ మార్పులతో రాష్ట్రం అతలాకుతలం అవుతున్న పరిస్థితుల్లో ఈ డేటా సెంటర్ ద్వారా పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని తెలిపారు. డేటా సెంటర్‌కు అవసరమైన రెండు వేల మెగావాట్ల విద్యుత్, రోజుకు అవసరమయ్యే 80 ఎంజిడిల నీళ్లు ఎక్కడి నుంచి వస్తాయన్నారు. దీని ప్రభావం విశాఖ, అనకాపల్లి జిల్లాలపై ఎలా ఉంటుందో పరిశీలించి నిర్ధారణ చేశారా? అని ప్రశ్నించారు. డేటా సెంటర్‌తో దేశంలోని 140 కోట్ల మంది సమాచారం, ప్రభుత్వ సర్వీసులు అనుసంధానించబడతాయని, తద్వారా పడిపోతున్న ఐటి కంపెనీల లాభాలు తిరిగి పుంజుకోవచ్చుగానీ ప్రజల వ్యక్తిగత, అత్యంత విశ్వసనీయమైన ప్రభుత్వ సమాచారానికి భద్రత ఏమిటని, ప్రయివేటు కార్పొరేట్ కంపెనీలు దీనిని దుర్వినియోగం చేయకుండా ఒప్పందంలో ఏమైనా షరతులు ఉన్నాయా? అని ప్రశ్నించారు. 2023లో పార్లమెంటు ముందుంచిన వ్యక్తిగత డేటా ప్రైవసీ బిల్లు ఇంత వరకు చట్టరూపం తీసుకోలేదన్నారు. బడా ఐటి కంపెనీల ఒత్తిడితోనే దానిని ఆపి ఉంచారని పేర్కొన్నారు. ఇప్పటికే వాట్సాప్ గవర్నెన్స్ పేరుతో ప్రజల డేటా ప్రైవేటు కంపెనీ చేతుల్లోకి పోతోందన్నారు. గూగుల్ డేటా సెంటర్ల ద్వారా పౌరుల వ్యక్తిగత గోప్యతకు ప్రమాదం రాదా? అని ప్రశ్నించారు. అనేక దేశాల్లో ప్రభుత్వ డేటా ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. మనదేశంలోనూ సి-డాక్, ఎన్ఐసి వంటి సంస్థలు ఉన్నాయని, ఇప్పుడు ప్రయివేటు ఐటి కంపెనీలు లాభాపేక్షతో వాటిని ఆక్రమిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వమే అవసరమైన డేటా సెంటర్లు పెడితే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ప్రజల, ప్రభుత్వ డేటాకు భద్రతా ఉంటుందని అన్నారు. పైఅంశాలను సమగ్రంగా పరిశీలించి నిష్ణాతుల అభిప్రాయాలు, అంతర్జాతీయ అనుభవాలు తీసుకొని ప్రజలకు నష్టం కాని రీతిలో గూగుల్ డేటా సెంటర్‌పై తుది నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు. రాష్ట్ర యువతకు ఉద్యోగాలు, ఉద్యోగ భద్రతకు కంపెనీల నుండి గ్యారెంటీ ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.జగన్, వి.కృష్ణారావు పాల్గొన్నారు.

ఐరాస పనిచేయడం లేదు

- గాజా యుద్ధ బాధితుల రక్షణలో విఫలం : లూలా

కౌలాలంపూర్ : బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డ సిల్వా ఆదివారం ఐక్యరాజ్యసమితి, ఇతర అంతర్జాతీయ సంస్థలపై నిప్పులు చెరిగారు. అవి పనిచేయడం ఆపేశాయని, గాజా యుద్ధ బాధితులను రక్షించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో సమావేశమైన అనంతరం లూలా విలేకరులతో మాట్లాడుతూ గాజా స్ట్రిప్‌లో చాలా కాలంగా కొనసాగుతున్న మారణహోమాన్ని ఎవరు అంగీకరిస్తారని ప్రశ్నించారు. ఇలాంటివి జరగకుండా అడ్డుకోవడానికి అంతర్జాతీయ సంస్థలను ఏర్పాటు చేశారని, అవి ఇప్పుడు పని చేయడం లేదని చెప్పారు. ఐరాస భద్రతా మండలి, ఐరాస అచేతనంగా ఉండిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. 'ఒక నాయకుడికి నోబెల్ బహుమతి కంటే తలపైకెత్తి నడవడం చాలా ముఖ్యం' అని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

లూలాతో ట్రంప్ భేటీ

అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన తర్వాత ట్రంప్ తొలిసారిగా ఆసియా - పసిఫిక్ ప్రాంతంలో పర్యటన ప్రారంభించారు. ఆసియాన్ సదస్సుకు హాజరైన ట్రంప్ పలు దేశాల నేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహిస్తున్నారు. బ్రెజిల్ అధ్యక్షుడు లూలాతో సమావేశమయ్యారు. వాణిజ్య అంశాలు, ప్రతీకార సుంకాలు ఈ సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చాయని సమాచారం.

అనుక్షణం.. అప్రమత్తం

(మొదటిపేజి తరువాయి)

క్రేన్‌లు, జెసిబిలు, ప్రతి సబ్ డివిజన్ స్థాయిలో సిద్ధం చేయాలన్నారు. జాతీయ రహదారులపై అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వాహనాలు సిద్ధం చేయాలన్నారు. పంటనష్టం వివరాలను స్పష్టంగా తెలుసుకునేలా వ్యవసాయశాఖ, ఆర్‌టిజిఎస్‌లు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. సముద్రంలోనే ఇంకా ఉన్న 82 మెకనైజ్డ్ బోట్లు, 37 మోటరైజ్డ్ బోట్లను సురక్షితంగా తీరానికి రప్పించే చర్యలు చేపట్టాలన్నారు.

సాంకేతికతతో ముందస్తు చర్యలు : హోంమంత్రి అనిత

అత్యాధునిక సమాచార సాంకేతికతను ఉపయోగించుకుని 'మొంథా' తుపాను నష్ట నివారణకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. తాడేపల్లిలోని విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో ఆదివారం అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో సంభవించిన తుపానుల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు వీలుగా అన్ని జిల్లాలకూ నోడల్ అధికారులను నియమించామన్నారు. 6 ఎన్‌డిఆర్ఎఫ్, 13 ఎస్‌డిఆర్ఎఫ్ టీమ్‌లు సిద్ధంగా ఉన్నాయని, హెలికాప్టర్లతో నేవీ అధికారులను సిద్ధం చేశామన్నారు. అవసరమైతే బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ నుంచి కూడా హెలికాప్టర్లు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హోంమంత్రి వెల్లడించారు. ఈ సమీక్షలో స్పెషల్ సిఎస్ సాయిప్రసాద్, విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ అప్రమత్తం : మంత్రి గొట్టిపాటి

తుపాను నేపథ్యంలో విద్యుత్ ఉద్యోగులంతా అప్రమత్తంగా ఉండాలని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్‌తో కలిసి ఆదివారం ఆయన సమీక్షించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమస్యలు తలెత్తితే వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టాలని, ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. ఈ సమావేశంలో మూడు డిస్కమ్‌ల సిఎమ్‌డిలు ఐ పృథ్వీతేజ్, శివశంకర్, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణకు మూడంచెల వ్యూహం : మంత్రి సత్యకుమార్

తుపాను సమయంలో వ్యాధుల నియంత్రణకు మూడంచెల వ్యూహం పాటించాలని అధికారులను వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. షెల్టర్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై పర్యవేక్షణ, సమన్వయ అధికారిగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ అధికారి వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఆస్పత్రుల్లో వైద్యులు, ఇతర పూర్తిస్థాయి సిబ్బంది అందుబాటులో ఉండాలని చెప్పారు. 108, 104, 102 వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

వార్డెన్లు వసతి గృహాల్లోనే ఉండాలి : మంత్రి సవిత

తుపానును దృష్టిలో ఉంచుకుని బిసి వసతి గృహాల్లో వార్డెన్లు, ఎంజెపి పాఠశాలల్లో ప్రిన్సిపల్స్, ఎబిసిడబ్ల్యుఒలు 24 గంటలూ వసతి గృహాలు, పాఠశాలల్లోనే ఉండాలని బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత ఆదేశించారు. విద్యార్థులతో కలిసి రాత్రి నిద్ర చేయాలని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు జిల్లాల కలెక్టర్ల ఆదేశాలను పాటిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న వసతి గృహాల విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. విద్యార్థుల్లో అనారోగ్య లక్షణాలు కనిపిస్తే తక్షణమే సమీపంలోని పిహెచ్‌సి వైద్యులతో వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

బంధువులకు మృతదేహాలు అప్పగింత

(మొదటిపేజి తరువాయి)

పోలీసులు తెలిపారు. తాను, శివశంకర్ మద్యం సేవించామని, మద్యం మత్తులో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిందని, శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందాడని, తాను గాయపడి ప్రాణాలతో బయటపడ్డానని ఎర్రి స్వామి పోలీసులకు వివరించారు. శివశంకర్ మృతదేహంలో మద్యం ఆనవాళ్లు ఉన్నట్లు కర్నూలు ప్రాంతీయ ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికలో నిర్ధారణ అయిందని ఎస్‌పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. బస్సు డ్రైవర్ లక్ష్మయ్య మద్యం సేవించలేదని తేలిందని చెప్పారు. ప్రమాద ఘటనలో పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేశారు. ఎ-1గా బస్సు డ్రైవర్ మిరియాల లక్ష్మయ్యను, ఎ-2గా వేమూరి కావేరి ట్రావెల్స్ యజమాని పేర్లను చేర్చారు.



కళ్ళు కాయలు కాచాయి



శివలింగపురం గ్రామంలో రాజయ్య, రాజమ్మ దంపతులు ఉన్నారు. వారి ఒక్కగానొక్క కొడుకు శ్రీను ఉద్యోగరీత్యా కుటుంబంతో బొంబాయిలో స్థిరపడ్డాడు. తల్లి, తండ్రి ముసలివారు అయ్యారు అందుచేత వారిని తనదగ్గర ఉంచుకోవడమే శ్రేయస్కరమని భావించి తన అభిప్రాయాన్ని తల్లిదండ్రులకు చెప్పాడు శ్రీను.

'పచ్చని పల్లె ఒడిలో ఉన్న ఆనందం పట్నంలో దొరకదని, అక్కడ మేము ఇమడలేమని' వాళ్లు చెప్పారు. చేసేదేమీ లేక ప్రతి ఏడాది సంక్రాంతికి శ్రీను కుటుంబంతో వచ్చి వారం రోజుల పాటు అమ్మానాన్నతో ఆనందంగా గడిపి వెళ్తున్నాడు. కొడుకు, మనవడి రాక కోసం ఏడాదంతా కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురు చూడడం వాళ్లకి అలవాటైంది. ఒకసారి సంక్రాంతి పండగ సమీపించడంతో మనవడి కోసం జంతికలు, చేగోడీలు, మినప సున్ని చేసింది రాజమ్మ.


పండగ ముందు రోజు ఇంటి ముందుకు కారు వచ్చి ఆగింది. అందులోనుంచి కొడుకు, కోడలు, మనవడు ముగ్గురూ దిగారు. వారిని చూడగానే ఆనందంతో కళ్లల్లో నీళ్ళు తిరిగాయి రాజయ్యకు. వాళ్ల దగ్గరికి వెళ్లి మనవడిని గుండెలకు హత్తుకున్నాడు. రాజమ్మ ఎదురుగా వెళ్ళి కొడుకును, కోడలిని పలకరించి, మనవడిని ఎత్తుకుని 'మీకోసం చూసి చూసి మీ తాత కళ్ల కాయలు కాచాయి రా!' అంది. 'అదేంటి నానమ్మా! చెట్లు కదా కాయలు కాస్తాయి?' అన్నాడు ఆశ్చర్యంగా గడుసు మనవడు.

'నిజమే రా మనవడా! 'కళ్ల కాయలు కాచు' అనేది ఒక జాతీయం. పువ్వు పూసి అది కాయగా మారడానికి చాలా సమయం పడుతుంది. అలాగే ఏదైనా విషయం కోసం ఆసక్తిగా, ఓపికగా ఎదురు చూసే సందర్భంలో ఈ జాతీయాన్ని ఉపయోగిస్తారు. ఈ జాతీయం ఒక వ్యక్తి నిరీక్షణను తెలియజేస్తుంది' అని చెప్పింది రాజమ్మ.

'భలే భలే!' అంటూ మామ్మ బుగ్గపై ముద్దు పెట్టాడు మనవడు. 'తాతా! నీ కళ్ళు కాయలు కాచాయా? పళ్ళు కూడా అవుతాయా?' అని తాతను కొంటెగా ప్రశ్నించాడు మనవడు. 'అవునురా, నువ్వు వచ్చేవుగా పండేయి లే' అని రాజయ్య నవ్వుతూ మనవడి చేతికి అరటిపండు ఇచ్చాడు.


– కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.

నేను గీసిన బొమ్మ





షేక్ మీరాభి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
మునుకుళ్ళ,
తిరువూరు మండలం,
ఎన్టీఆర్ జిల్లా.





ఫ్రాన్సీ పెర్సిస్,
4వ తరగతి,
ఎంఐసిఇ స్కూలు,
మార్కాపురం,
ప్రకాశం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు మారిన నేపథ్యంలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. గాబరా పడకుండా జాగ్రత్తగా దగ్గరలోని ఆరోగ్య కేంద్రాల్లోని డాక్టర్లను కలిసి వారిచ్చే మందులను వాడుకోవటం ద్వారా త్వరగా తగ్గిపోతాయి. నిర్లక్ష్యం చేస్తే వాటి ఉధృతి పెరిగి ఆరోగ్యం మరింత క్షీణించే అవకాశం ఉంటుంది. అందుకే ప్రతి ఒక్కరూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరిస్తూ వ్యాధులకు దూరంగా ఉండొచ్చు. ఏదైనా జ్వరమో, ఇతర వ్యాధులకు గురైతే వెంటనే అప్రమత్తమైతే త్వరగానే తగ్గించుకునే వైద్య సదుపాయాలు ప్రభుత్వ వైద్యశాలల్లో అందుబాటులో ఉన్నాయి.

విష జ్వరాలను అశ్రద్ధ చేయొద్దు

చలి వాతావరణంలో విష జ్వరాలు (వైరల్ ఫీవర్స్) వ్యాప్తిస్తుండటం సర్వసాధారణంగా జరిగేదే. వైరస్‌లు ఒకరి నుంచి మరొకరికి త్వరగా వ్యాపించగల సూక్ష్మ సూక్ష్మక్రిములు. వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల విష జ్వరాలు వస్తాయి. వైరస్‌లు చాలా చిన్న ఇన్ఫెక్షన్ ఏజెంట్లుగా ఉండి శరీరంలోని కణాలపై దాడి చేస్తాయి. వైరల్ జ్వరం తుమ్మడం, దగ్గు, శ్వాస తీసుకోవడం లేదా సోకిన వ్యక్తి తాకిన వస్తువులను తాకడం ద్వారా వ్యాపిస్తుంది. జలుబు, ఫ్లూ వైరస్‌లతో సహా వివిధ వైరస్‌లు వైరల్ అనారోగ్యానికి కారణమవుతాయి. ఆహారం, పానీయాలు ప్రాణాంతక వైరస్‌లతో కలుషితం కావొచ్చు. కలుషితమైన ఆహారాన్ని మింగడం వల్ల నోరోవైరస్, ఎంట్రోవైరస్ వంటి వైరల్ ఇన్ఫెక్షన్లు వస్తాయి. కీటకాలు లేదా జంతువుల ద్వారా సంక్రమించే వైరస్‌లు జ్వరం, రాబిస్ వంటి వైరల్ ఇన్ఫెక్షన్లకు కారణమవుతాయి. వైరల్ ఇన్ఫెక్షన్ ఉన్న వ్యక్తితో శారీరక ద్రవాలను మార్పిడి చేయడం ద్వారా సంభవించొచ్చు. హెపటైటిస్ బి, హెచ్ఐవి. తక్కువ రోగనిరోధక శక్తి కారణంగా, పిల్లలు ఇన్ఫెక్షన్ల భారిన పడే ప్రమాదం ఉంది. వృద్ధులు చాలా బలహీనమైన రోగనిరోధక శక్తితో ఇన్ఫెక్షన్లకు ఎక్కువ అవకాశం ఉంది. వాతావరణ కాలుష్యం, ఆ ప్రభావిత ప్రాంతాల్లో ఎక్కువగా వైరల్ ఇన్ఫెక్షన్లు వ్యాప్తి చెందటానికి కారణమవుతాయి. అవగాహన లోపంతో కొందరు ఈ జ్వరాన్ని నిర్లక్ష్యం చేస్తుంటారు. ఫలితంగా అది ఉధృతి దాలుస్తుంది. విపరీతమైన జ్వరం వచ్చినప్పుడు కొందరు అధిక శరీర ఉష్ణోగ్రతను తగ్గించడానికి యాంటీ బయాటిక్స్ వాడతారు. మరికొందరు సొంతంగా వైద్యాన్ని పాటిస్తారు. ప్లేట్‌లెట్స్ పడిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తీవ్రమైన వైరల్ ఇన్ఫెక్షన్లు, రుతుపవనాల మార్పులు, పర్యావరణ ఇన్ఫెక్షన్ల వల్ల కలిగే జ్వరాన్ని వైరల్ జ్వరంగా చెప్పొచ్చు. సాధారణ శరీర ఉష్ణోగ్రత పెరుగుదలే అత్యంత సాధారణ లక్షణం. ఇది వాతావరణ పరిస్థితులు మారిన సమయంలో వర్షాలు కురుస్తున్న సమయంలో అన్ని వయసుల వారిని ప్రభావితం చేస్తుంది.





సమస్యలను నివారించడానికి, సజావుగా కోలు కోవడానికి కాలానుగుణ జ్వరానికి చికిత్స చాలా అవసరం.

ఇవీ తెలుసుకోండి

- వైరల్ జ్వరాలు రెండు నుండి మూడు రోజులు, ఒక్కోసారి రెండు వారాల పాటు కూడా ఉండొచ్చు.
- శరీరం వైరస్‌తో పోరాడుతున్నప్పుడు వైరల్ ఇన్ఫెక్షన్లు రోగనిరోధక శక్తిని తాత్కాలికంగా బలహీనపరుస్తాయి. జ్వరమొచ్చిన వారు ఇతర ఇన్ఫెక్షన్లకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- తగినంత విశ్రాంతిని శరీరానికి ఇస్తే వేగంగా కోలుకోవచ్చు.

విష జ్వరాల్లో రకాలివి...

వైరస్‌లతోనే వ్యాపించే విష జ్వరాలు ఆయా ప్రభావిత ప్రాంతాల్లో మరింతగా విజృంభిస్తుంటాయి. విష జ్వరాల్లో కొన్ని సాధారణ రకాలు కూడా ఉన్నాయి. శ్వాసకోశ వైరల్ జ్వరాలు, దోమల ద్వారా సంక్రమించే వైరల్ జ్వరాలు, ఎక్సాంథెమాటిక్ వైరల్ జ్వరాలు , జీర్ణకోశ వైరల్ జ్వరాలు, హెమరేజిక్ వైరల్ జ్వరాలు. వాటి గురించి తెలుసుకుందాం..

శ్వాసకోశ వైరల్ జ్వరాలు : ఈ జ్వరాలు ఇన్ఫ్లుయెంజా, కోవిడ్ 19, ఆర్ఎస్‌వి వంటి శ్వాసకోశ వ్యవస్థను ప్రభావితం చేసే వైరస్‌ల వల్ల సంభవిస్తాయి. లక్షణాలు సాధారణంగా జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉంటాయి.

దోమల ద్వారా సంక్రమించే వైరల్ జ్వరాలు: ఈ జ్వరాలు డెంగ్యూ, చికున్‌గున్యా, జికా వైరస్ వంటి దోమ కాటు ద్వారా వ్యాపిస్తాయి. లక్షణాలు తరచుగా అధిక జ్వరం, కీళ్ల నొప్పులు, దద్దుర్లు కొన్నిసార్లు తీవ్రమైన సమస్యలను కల్గివుంటాయి.

ఎక్సాంథెమాటిక్ వైరల్ జ్వరాలు: ఇవి వైరల్ ఇన్ఫెక్షన్లు. ఇవి జ్వరంతో పాటు దద్దుర్లు కూడా కలిగిస్తాయి. మీజిల్స్, చికెన్ పాక్స్, రుబెల్లా ఉదాహరణలు. జ్వరం తర్వాత దద్దుర్లు కనిపిస్తాయి.

జీర్ణకోశ వైరల్ జ్వరాలు: ఈ ఇన్ఫెక్షన్లు నోరోవైరస్ లేదా రోటవైరస్ వంటి వైరస్‌ల వల్ల సంభవిస్తాయి. ఇవి ప్రధానంగా జీర్ణవ్యవస్థను ప్రభావితం చేస్తాయి. జ్వరం, వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి లక్షణాలు.

హెమరేజిక్ వైరల్ జ్వరాలు: ఇవి ఎబోలా, లస్సా జ్వరం వంటి తీవ్రమైన, తరచుగా ప్రాణాంతక వైరల్ ఇన్ఫెక్షన్లు. అధిక జ్వరం, రక్తస్రావం, కొన్ని సందర్భాల్లో, అవయవ వైఫల్యం లక్షణాలు.

లక్షణాలు ఇవే...

- కండరాలు, కీళ్ల నొప్పులు
  తలనొప్పి
- వికారం లేదా వాంతులు
- తీవ్ర జ్వరం
- కళ్లు ఎరుపుగా మారటం, కంటి సమస్యలు
  గొంతునొప్పి
- వంటినొప్పులు
- ముక్కు కారటం
- అలసటగా ఉండటం
- శరీర నొప్పులు
- జలుబు
- అధిక శరీర ఉష్ణోగ్రత, 104 డిగ్రీల వరకు
- ముఖంలో వాపు
- అప్పుడప్పుడు చలి
- చర్మంపై దద్దుర్లు

చికిత్సలు


వైరల్ జ్వరాన్ని నిర్ధారించడంలో రక్త పరీక్షలు, గొంతు స్వాబ్‌లు, బాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు, నిర్దిష్ట వైరస్‌ను గుర్తించడానికి రక్త నమూనాలు దోహదపడతాయి. ఈ పరీక్షలు డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్ వంటి అనారోగ్యాలను గుర్తించడంలో సహాయపడతాయి, తద్వారా వైరల్ జ్వరానికి ఖచ్చితమైన చికిత్స లభిస్తుంది. రక్త పరీక్షలు, గొంతును శుభ్రపర్చటం ద్వారా కూడా వైరస్‌లను తెలుసుకోవచ్చు.

- అనారోగ్యానికి కారణమయ్యే వైరస్‌ను గుర్తించడానికి రక్తం, కఫం లేదా మూత్రం నమూనాలు ఉపయోగపడతాయి.
- ప్రతిరోజూ సూర్యరశ్మి శరీరానికి తగిలేలా చూసుకోవాలి.
- జ్వరం, శరీర నొప్పులను తగ్గించడానికి కొన్ని మందులు ఉపయోగపడతాయి.
- హెర్బల్ టీలు, పసుపు పాలు, ఆవిరి పీల్చడం, తగినంత విశ్రాంతి కూడా తేలికపాటి సందర్భాల్లో మందులతో పాటు లేదా బదులుగా ఉపశమనం కలిగిస్తాయి.
- చలివాతావరణం ఉన్నప్పుడు ఉన్ని దుస్తులు ధరించాలి.
- రాత్రిపూట వేడిపానీయాలను తీసుకోవాలి.
- పడుకున్నప్పుడు దుప్పట్లను తప్పనిసరిగా వాడాలి.
- విటమిన్ సి, జింక్ రోగనిరోధక శక్తిని పెంచడానికి సప్లిమెంట్లు సహాయపడొచ్చు.
- యాంటీవైరల్ మందులు కూడా ఉపయోగ పడతాయి.
- అనారోగ్యంతో ఉన్న వ్యక్తులకు దూరంగా ఉండాలి
- తరచుగా చేతులు కడుక్కోవాలి
- రద్దీగా ఉండే ప్రదేశాల్లో మాస్క్ ధరించటం మేలు
- వేడిగా ఉండే ఆరోగ్యకరమైన ఆహారం తినాలి కాచి చల్లార్చిన నీటిని తాగాలి.



– డాక్టర్ ఎ.ఎం.ఆదినగేష్
ఎండి జనరల్ మెడిసిన్
సివిల్ సర్జన్ స్పెషలిస్టు,
ఏరియా ఆసుపత్రి,
ఎమ్మిగనూరు, కర్నూలు జిల్లా.
సెల్ : 95530 99577.

నెలాఖరులో 'బాహుబలి : ది ఎపిక్', 'మాస్ జాతర'



దసరా పండక్కి వచ్చిన ఓజీ, కాంతార : చాప్టర్ 1 సినిమాలు ప్రేక్షకాదరణ పొందాయి. ఆ తర్వాత దీపావళికి విడుదలైన తెలుసు కదా, కె.ర్యాంప్, డ్యూడ్, మిత్రమండలి సినిమాలు మిశ్రమ స్పందనను అందుకున్నాయి. వీటిలో డ్యూడ్ దక్షిణాదిలో బాగా దూసుకుపోతోంది. మోహన్‌లాల్ 'వృషభ' నవంబర్ 6న విడుదల కానుంది. రాబోయే క్రిస్మస్‌కు అడివి శేష్ 'డెకాయిట్', రోషన్ మేకా 'ఛాంపియన్', ఆది సాయికుమార్ 'శంబాల', విశ్వక్ సేన్ 'ఫంకీ', గుణశేఖర్ దర్శకత్వంలోని భూమిక 'యూఫోరియా', కొత్తవారితో 'పతంగ్' సినిమాలు డిసెంబర్ 25న విడుదల కానున్నాయి. యాక్షన్, కామెడీ, స్పోర్ట్స్, సోషల్ డ్రామా జానర్లలో ఈ సినిమాలు రాబోతున్నాయి. రవితేజ నటించిన 'మాస్ జాతర' సినిమా ఈనెల 31న విడుదల కానుంది. దర్శకుడు బాహుబలి రెండు భాగాలను కలిపి బాహుబలి: ది ఎపిక్ ఈనెల 31న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. వీటి ద్వారా డిసెంబర్ 5న బాలకృష్ణ నటించి 'అఖండ'కు సీక్వెల్ 'అఖండ–2 : తాండవం' విడుదల కానుంది. బాలకృష్ణ– బోయపాటి కాంబినేషన్‌లో వస్తోన్న యాక్షన్ మూవీ ఇది. 2021లో విడుదలైన అఖండ చిత్రానికి సీక్వెల్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ మూవీని 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపి ఆచంట భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. బాలకృష్ణ చిన్న కుమార్తె ఎం.తేజస్విని నందమూరి సమర్పిస్తున్నారు. ఈ సినిమా తర్వాత సంక్రాంతి పండుగకు వచ్చే సినిమాలు మినహా పెద్ద కథానాయకుల సినిమాలు లేవు.

ధమాకా జోడీతోనే 'మాస్ జాతర'

కథానాయకుడు రవితేజ, కథానాయిక శ్రీలీల జంటగా నటించిన సినిమా 'మాస్ జాతర' ఈనెల 31న విడుదల కానుంది. వీళ్లద్దరూ కలిసిన నటించిన 'ధమాకా' సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. మూడేళ్ల తర్వాత వీరి కలయికలో వస్తున్న తాజా చిత్రం 'మాస్ జాతర' కోసం ప్రేక్షకులు ఎదురుచూస్తునానరు. ధమాకాకు మంచి ఆల్బమ్‌ను ఇచ్చిన భీమ్స్ సిసిరోలియో ఈ సినిమాకు సంగీతాన్ని అందించారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన పాటల్లో తూ మేరా లవ్వరు, ఓలే ఓలే.., హుడియో హుడియో, అదే సూపర్ డూపర్ హిట్టు సాంగ్! ఈ పాటకు రిథమ్ లేదు.. కదం లేదు, పదం లేదు.. అర్థం లేదు.. పర్థం లేదు అంటూ సాగే పాటలు సామాజిక మాధ్యమాల్లో మంచి జోరుమీద ట్రెండింగ్‌లో ఉన్నాయి. సూపర్‌హిట్ సాంగ్‌ను రోహిణి, భీమ్స్ సిసిరోలియో ఆలపించారు. భాను భోగవరపు దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. గతంలో రవితేజ, సురేందర్‌రెడ్డి కాంబినేషన్‌లో కిక్, కిక్ 2 వచ్చిన విషయం తెలిసిందే. 2009లో విడుదలైన 'కిక్' బ్లాక్‌బస్టర్‌గా నిలించారు. ఆ తర్వాత రవితేజ, సురేందర్‌రెడ్డి కాంబోలో వచ్చిన 'కిక్ 2' మాత్రం ఆ స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. ఇప్పుడు మరో సినిమా వీరిద్దరి కాంబోలో రాబోతోంది. 'మాస్‌జాతర' సినిమా నుంచి విడుదలైన టీజర్, ట్రైలర్లు ఆకట్టుకునేలా ఉన్నాయి. ప్రచార కార్యక్రమాలను సైతం చిత్ర యూనిట్ పెద్దఎత్తున నిర్వహిస్తోంది.

బాహుబలి: ది ఎపిక్‌పై సర్వత్రా ఆసక్తి

దర్శకధీరుడు రాజమౌళి మరోసారి బాహుబలిని టాలీవుడ్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. బాహుబలి పేరు వినగానే దేశవ్యాప్తంగా సినీ ప్రియుల రోమాలు నిక్కబొడుచుకుంటాయి. వారిని అంతగా ఆకట్టుకుంది ఈ సినిమా. అలా తీర్చిదిద్దడంలో రాజమౌళి ఘనవిజయాన్ని సాధించారు. బాహుబలి1, బాహుబలి 2గా ఇప్పటివరకు ప్రేక్షకులు సినిమాలు చూసుకుంటూ వస్తున్నారు. రెండింటినీ కలిపి ఒకటే సినిమా చేశారు. బాహుబలి1లో కొన్ని, బాహుబలి2లోని కొన్ని సన్నివేశాలకు కత్తెర వేసి ఒకటే బాహుబలిగా నిర్మాతలు దీన్ని సిద్ధం చేశారు. బాహుబలి1, 2లను ఏవిధంగా ఎడిట్ చేశారనే ఆసక్తి సినీ ప్రియుల్లో నెలకొంది. రెండు భాగాలను



కలిపి బాహుబలి: ది ఎపిక్ పేరుతో థియేటర్లలో రిలీజ్ చేయబోతున్నారు. ఈనెల 31న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా బిగ్‌స్క్రీన్‌పై సందడి చేయనుంది. ఇప్పటికే టీజర్, ట్రైలర్‌లను నిర్మాతలు విడుదల చేశారు. సరికొత్తగా చూపించటంతో సామాజిక మాధ్యమల్లో బాగానే రెస్పాన్స్ వస్తోంది. రన్‌టైమ్ 3.40 గంటలు ఉంటుందని నిర్మాత శోభు యార్లగడ్డ ఇటీవల వెల్లడించారు. బాహుబలి 1 ముగిశాక ఇంటర్వెల్, ఆ తర్వాత బాహుబలి 2 ఉంటుందని తెలిపారు. దాన వీర శూర కర్ణ సినిమా 3.46 గంటలు. ఆ తర్వాత ఎక్కువ నిడివి ఉన్న సినిమాల జాబితాలో బాహుబలి: ది ఎపిక్ చేరనుంది. బాహుబలి డాక్యుమెంటరీ ఈ ఏడాది చివరిలో ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. కథానాయకుడిగా ప్రభాస్, కథానాయికగా అనుష్క, ప్రతినాయకుడిగా దగ్గుపాటి రానాతోపాటుగా రమ్యకృష్ణ, నాజర్, సత్యరాజ్ తదితరులు అద్భుతంగా నటించిన విషయం తెలిసిందే. బాహుబలి 1, బాహుబలి 2 సినిమాలు ప్రపంచస్థాయిలో ప్రేక్షకులను ఆకర్షించాయి. ఇప్పుడు బాహుబలి : ది ఎపిక్ ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందే.





బెంగళూరుకే ప్రైమ్ వాలీబాల్ లీగ్ టైటిల్

- ఫైనల్లో 3-0తో ముంబయి మీటియర్స్‌పై గెలుపు
- ప్రైమ్ వాలీబాల్ లీగ్ సీజన్ 4

హైదరాబాద్ : ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాల్గో సీజన్ చాంపియన్‌గా బెంగళూరు టార్పెడోస్ నిలిచింది. ఆదివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలోజరిగిన పీవీఎల్ టైటిల్ పోరులో ముంబయి మీటియర్స్‌పై 3-0తో బెంగళూరు టార్పెడోస్ అదిరే విజయం నమోదు చేసింది. మూడు సెట్ల థ్రిల్లర్‌లో 15-13, 16-4, 15-13తో బెంగళూరు టార్పెడోస్ తిరుగులేని విజయం సాధించింది. బెంగళూరు టార్పెడోస్ నుంచి జోయెల్ బెంజిమిన్, సేతు, మాట్ వెస్ట్, జెలెన్ పెన్రోస్‌లు రాణించారు. ప్రైమ్ వాలీబాల్ లీగ్ వరుసగా నాల్గో సీజన్‌లో కొత్త చాంపియన్‌ను చూసింది. తొలి సీజన్‌లో కోల్‌కతా థండర్‌బోల్ట్స్, రెండో సీజన్లో అహ్మదాబాద్ డిఫెండర్స్, మూడో సీజన్లో కాలికట్ హీరోస్ పీవీఎల్ విజేతలుగా నిలిచిన సంగతి తెలిసిందే.



మినీ క్వాలిఫయర్‌లో తెలుగు టైటాన్స్ గెలుపు

37-32తో బెంగళూరు బుల్స్‌పై పైచేయి
ప్రొ కబడ్డీ లీగ్ సీజన్ 14

న్యూఢిల్లీ : ప్రొ కబడ్డీ లీగ్ (పీకెఎల్) 12వ సీజన్‌లో తెలుగు టైటాన్స్ ఎలిమినేటర్3కు చేరుకుంది. ఆదివారం న్యూఢిల్లీలోని త్యాగరాజ్ ఇండోర్ స్టేడియంలో జరిగిన మినీ క్వాలిఫయర్‌లో బెంగళూరు బుల్స్‌పై 37–32తో ఐదు పాయింట్ల తేడాతో తెలుగు టైటాన్స్ ఘన విజయం సాధించింది. తెలుగు టైటాన్స్ కెప్టెన్ విజయ్ మాలిక్ (10 పాయింట్లు), ఆల్‌రౌండర్ భరత్ హుడా (12 పాయింట్లు) సూపర్ టెన్ షోతో రాణించారు. బెంగళూర్ బుల్స్ తరపున అలీరెజా (11 పాయింట్లు), ఆశీష్ మాలిక్ (5 పాయింట్లు) రాణించారు. మంగళవారం జరిగే ఎలిమినేటర్ 3 మ్యాచ్‌లో.. ఎలిమినేటర్ 2 విజేతతో తెలుగు టైటాన్స్ తలపడనుంది. మినీ క్వాలిఫయర్‌లో ఓడిన బెంగళూరు బుల్స్.. సోమవారం జరిగే ఎలిమినేటర్ 2లో పట్నా పైరేట్స్‌తో తలపడనుంది.

హైదరాబాద్ 435/10

పుదుచ్చేరితో రంజీ మ్యాచ్

పుదుచ్చేరి : రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్–డి రెండో మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో మంచి స్కోరు సాధించింది. కెప్టెన్ రాహుల్ సింగ్ (114, 175 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్) శతకానికి తోడు తన్మయ్ అగర్వాల్ (50, 110 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), హిమతేజ (66, 159 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు), రాహుల్ రాడేశ్ (81, 161 బంతుల్లో 10 ఫోర్లు) అర్ధ సెంచరీలతో కదంతొక్కారు. రోహిత్ రాయుడు (34), అనికెత్ రెడ్డి (18), తనయ్ త్యాగరాజన్ (14) ఆఖర్లో విలువైన పరుగులు జోడించారు. 134.5 ఓవర్లలో 10 వికెట్లకు హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 435 పరుగుల భారీ స్కోరు సాధించింది. రెండో రోజు ఆఖర్లో బ్యాటింగ్‌కు వచ్చిన పుదుచ్చేరి తొలి ఇన్నింగ్స్‌లో 9 ఓవర్లలో 1 వికెట్‌కు 25 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు ఇంకో 410 పరుగుల వెనుకంజలో కొనసాగుతుంది.



ఆఖరు మ్యాచ్ వర్షార్పణం

ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్

ముంబయి : ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్ ఆఖరు గ్రూప్ దశ మ్యాచ్ వరుణుడి ఖాతాలో పడింది. వర్షం అంతరాయంతో మ్యాచ్‌ను 27 ఓవర్లకు కుదించారు. తొలుత బంగ్లాదేశ్ 27 ఓవర్లలో 9 వికెట్లకు 119 పరుగులు చేసింది. భారత బౌలర్లలో రాధ (3/30), శ్రీచరణి (2/23) రాణించారు. ఛేదనలో భారత్ 8.4 ఓవర్లలో 57/0తో ఉండగా వరుణుడు మరోసారి అంతరాయం కలిగించాడు. దీంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేశారు. భారత్, బంగ్లాదేశ్ పాయింట్లు పంచుకున్నాయి. ప్రపంచకప్ తొలి సెమీస్‌లో ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా పోటీపడనుండగా.. గురువారం జరిగే రెండో సెమీస్‌లో భారత్, ఆస్ట్రేలియా అమీతుమీ తేల్చుకోనున్నాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68